

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 190 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 10, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



# అప్పుల దేశం..
# గొప్పలు !




హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

అప్పుల భారాన్ని ఆదర్శవంతంగా ప్రచారం చేసుకుంటున్నా కేంద్ర ప్రభుత్వాన్ని గద్దదించాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు.అడ్డుదారిలో అధికారాలను పొందుకుంటూ దేశ ప్రజలను అరిగోసపెట్టుకుంటున్న బిజెపి ప్రభుత్వం ధనవంతులకు దోస్తాని లాగా పేదలకు పగస్తులు లాగా దేశాన్ని పాలిస్తుందని తీవ్రంగా విమర్శించారు.12 సంవత్సరాల దేశపాలనలో పేదలకు జరిగిన మేలు పేదలకు జరిగిన ఆర్థిక లాభం ఉన్నతమైన మైనస్ లో ఉందని గుర్తు చేశారు.దేశవ్యాప్తంగా పేద ప్రజలు పనులు చేసుకొని బ్రతకడానికి కూడా ఉపాధి లేని పరిస్థితికి దేశ ఆర్థిక వ్యవస్థను దిగజార్చిన కేంద్రం దేశ ప్రజలకు సమాధానం చెప్పడానికి ధైర్యం చాలక ముఖం చాటేస్తుందని



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

- లక్షల కోట్ల రూపాయలను మింగేస్తున్నారు
- లెక్క పత్రాలు లేవు ఆధారాలు ఏమాత్రం ఉండవు
- నిత్యవసరాల ధరలతో ప్రజలను నిండా ముంచుతున్నారు
- కార్పొరేట్ సంస్థల కొమ్ముగాస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఎల్ఐసిలో మరో భారీ కుంభకోణం
- ఏకంగా 15 లక్షల కోట్లు దొబ్బేసి ఉడాయిస్తున్న పెద్దమనిషి
- పేదలను వేధించడం అంటే కేంద్ర ప్రభుత్వానికి ఎంతో ఇష్టం
- ఒకవైపు ఆధారాలు లేని దోపిడీ మరోవైపు పేదోడిపై అప్పుల పిడుగు భారం
- ప్రజలు మాట్లాడొద్దు యువత ప్రశ్నించవద్దు
- బరితెగింపు తనంతో బజారు మార్గాలను బలపరుచుకుంటున్నారు
- దేశంలో పేదలు బతకాల.... చావాలా...
- కొత్త పరిశ్రమలకు దిక్కులేదు ఉన్న పరిశ్రమలకు రక్షణ లేదు
- పతనవస్థలో ప్రభుత్వ వ్యవస్థలు
- ముందుకు నడవాల్సిన దేశం వేగంగా వెనక్కి పరుగెడుతుంది : డాక్టర్ బరిగెల శివ



## ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ కార్యాలయం

**ప్రారంభోత్సవ ఏర్పాట్లు పరిశీలించిన శ్రీధర్ బాబు**

హైదరాబాద్,జూన్9(జై భీమ్ న్యూస్) :

ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం... సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై వారికి దిశా నిర్దేశర చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.



## మొహర్రం ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు



మొహర్రం ఏర్పాట్లపై
ఉన్నతస్థాయి సమీక్ష
రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

6

## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

2

నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా
సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్

## నైరుతి ఆగమనంతో పలకరించిన తొలకరి

హైదరాబాద్ నగరంలో
ఉరుములతో
భారీ వర్షం
ఎప్పటిలాగే లోతట్టు ప్రాంతాలు
జలమయం
అప్రమత్తంగా ఉండాలని వాతావరణ
శాఖ హెచ్చరిక

5



## ప్రతి సభకు రూ.15 కోట్ల ఖర్చా..?

**ప్రజాధనంపై పెరుగుతున్న ప్రశ్నలు**


హైదరాబాద్(జై భీమ్ న్యూస్)



తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న వరుస బహిరంగ సభలపై రాజకీయ విమర్శలు మరింత తీవ్రం అవుతున్నాయి. ఒక్కో సభకు రూ.15 కోట్లకు పైగా ఖర్చు అవుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే ఈ సంఖ్యకు సంబంధించి అధికారిక ప్రభుత్వ గణాంకాలు ఇప్పటివరకు వెల్లడికాలేదు. వేదికల ఏర్పాటు, భారీ ఎల్ఈడీ స్క్రీన్లు, ప్రచార సామగ్రి, భద్రతా ఏర్పాట్లు, రవాణా సౌకర్యాలు, ఆర్టీసీ బస్సుల వినియోగం వంటి అంశాలపై కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయని విమర్శకులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్న సమయంలో ఇలాంటి భారీ సభలపై ప్రజాధనం ఖర్చు చేయడం సమంజసమేనా అనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రతిపక్షాల వాదన ప్రకారం, గత కొన్ని రోజుల్లో జరిగిన జడ్చర్ల, కోహెడ, మియాపూర్, పరేడ్ గ్రౌండ్స్ సభలను కలిపి చూస్తే వందల కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చయ్యే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు మాత్రం ఇవి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల ప్రచార సభలేనని, ప్రజలకు ప్రభుత్వ పనితీరును వివరించేందుకే నిర్వహిస్తున్నామని చెబుతున్నారు. “ప్రజా ధనం ప్రజల సమస్యల పరిష్కారానికా..? లేక రాజకీయ ప్రచారం, బలప్రదర్శనకా..?” అనే చర్చ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# జూన్ 10 నుంచి 20 వరకు నేషనల్ లోక్ అదాలత్

పెండింగ్ ట్రాఫిక్ కేసులు, సీజ్ చేసిన వాహనాల యజమానులకు కాజీపేట ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి




**కాజీపేట, 9 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్, మైనర్ డ్రైవింగ్ తదితర కేసులు ఎదుర్కొంటున్న వారు జూన్ 10 నుంచి 20 వరకు నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కాజీపేట ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఖాజీపేట రైల్వే 2వ తరగతి కోర్టులో నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్‌లో కేసులకు సంబంధించిన వ్యక్తులు హాజరై తమ కేసులను తక్కువ జరిమానాతో పరిష్కరించుకుని క్లోజ్ చేసుకోవచ్చని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు వాహన పత్రాలు తీసుకురావాలని, డ్రైవింగ్ లైసెన్స్ కేసులు ఉన్నవారు ఆధార్ కార్డు, మీ సేవ కేంద్రంలో లైసెన్స్ కోసం దరఖాస్తు చేసిన రసీదును సమర్పించాలని సూచించారు. మైనర్ డ్రైవింగ్ కేసులకు సంబంధించి బర్త్ సర్టిఫికేట్ లేదా ఎస్ఎస్‌సీ మెమో వంటి వయస్సు ధృవీకరణ పత్రాలను తీసుకురావాలని పేర్కొన్నారు. అదేవిధంగా 2020 నుంచి 2024 మధ్య కాలంలో డ్రంకెన్ డ్రైవ్, వితౌట్ డ్రైవింగ్ లైసెన్స్, పెండింగ్ చలాన్లు లేదా ఇతర కారణాలతో కాజీపేట ట్రాఫిక్ పోలీసులచే స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు ఇంకా పోలీసుల ఆధీనంలో ఉన్నట్లయితే, సంబంధిత వాహన పత్రాలతో కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ వాహనాలను తిరిగి తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కేసులు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకన్న కోరారు.

## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

**న్యూఢిల్లీ,జూన్9(జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు.సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## దేశ ద్రోహులకు స్థానం లేదు.. భారత్ ధర్మసత్రం కాదు

లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

**లక్నో,జూన్9(జై భీమ్ న్యూస్) :**

దేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విశ్వాసం లేని వారికి భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లఖ్‌నవూలో మంగళవారంనాడు జరిగిన శ్రీరామకథా మహోత్సవం ముగింపు వేడుకలో ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని ఆదర్శాలు యావద్దేశాన్ని ఏకం చేస్తున్నాయని చెప్పారు. 'భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదు. దేశ సంస్కృతి, వారసత్వం, విలువలను గౌరవించే వాళ్లు మాత్రమే ఇక్కడ గౌరవప్రదంగా జీవించవచ్చు. భారతదేశ స్ఫూర్తి, సంప్రదాయాలను అంగీకరించని వాళ్లకి ఇక్కడ స్థానం లేదు' అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. రామాయణ కాలానికి, నవీన భారతానికి మధ్య సారూప్యాన్ని వివరిస్తూ, దుష్టశక్తులు అధికారంలో ఉన్నప్పుడల్లా రాక్షసరాజు రావణాసురిడి కాలంలో ఏవిధంగా దుష్టశిక్షణ జరిగిందో అదే పునరావృత మవుతుందని అన్నారు. ÷శంలోని జనాభా మార్పు కోసం జరుగుతున్న కుట్రలో భాగమే 'లవ్ జిహాద్' అని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. రామాయణ కాలంలో కూడా ఖాళీగా ఉన్న భూములను మారీచుడు, ఖరదూషణాది రాక్షసులు దురాక్రమణ చేసేవారని, ల్యాండ్ జిహాద్‌కు పాల్పడేవారని అన్నారు. ప్రతి యుగంలోనే దుష్టశక్తులు ఉంటాయని, అయితే సత్యం, మతం పరిరక్షణకు శ్రీరాముడు ఏవిధంగా పాటుపడ్డారో అందరూ తెలుసుకుని కర్తవ్యబద్ధులుకావాలని, అంతా ఐక్యంగా నిలవాలని అన్నారు.

# అప్పుల "దేశం" గొప్పలు

మొదటి పేజీ తరువాయి

గుర్తు చేశారు. 12 సంవత్సరాలుగా భారత దేశ ఆర్థిక మంత్రి దేశ ఆర్థిక గణాంకాలను సాంకేతికంగా వివరించే ప్రయత్నాలు చేస్తూ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని తీవ్రంగా విమర్శించారు.పార్లమెంటు చట్టసభల్లో ఆర్థిక బడ్జెట్ ను ప్రవేశపెట్టే సందర్భాల్లో చిరునవ్వుతో దేశ ప్రజలపై అంచనాలను మించిన ఆర్థిక అప్పుల భారాన్ని వేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారని మండిపడ్డారు.ఒకరని ఇద్దరని ముగ్గురని నలుగురని కాకుండా పదుల సంఖ్యలో బడా పారిశ్రామికవేత్తలు కేంద్ర ప్రభుత్వం నాయకుల చుట్టూ తిరుగుతూ ఏకంగా దేశ ప్రధానిని విదేశాల టూర్లకు పంపిస్తూ వాళ్లకు సంబంధించిన వ్యాపారాల్లోని ఆర్థిక లావాదేవీలను కేసులను మాఫీ చేయించుకోవడం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సేవలను పుష్కలంగా వాడుకుంటున్నారని హెచ్చరించారు.ఆర్థిక భారం పేద ప్రజలను ఎంతలా వేధిస్తుందో ప్రతిపక్ష నాయకులు ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై నిరంతర పోరాటాలు చేస్తూ నిలదీస్తూ నిందలు వేస్తూ పేద ప్రజల తరఫున నిలబడాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నప్పటికిని ప్రజల అభివృద్ధిని మరిచిపోయిన కేంద్ర ప్రభుత్వం భారతదేశ ఆర్థిక వ్యవస్థను లూటీ మాఫీ చేస్తున్న పారిశ్రామికవేత్తల చేతుల్లో ఇరుక్కుపోయి దేశ సంపదను దోచిపెడుతున్నారని ఎద్దేవా చేశారు.ప్రజల ఆరోగ్యం ప్రజల ఆర్థిక విధానం ప్రజల విద్యా విధానం ప్రజల నిత్యవసరాల పరిస్థితిలను పూర్తిగా నీరు కారుస్తూ పేద ప్రజల ఆర్థిక జీవన విధానాలను చిందరవందర చేస్తున్నారని విమర్శించారు.

**హామీల అమల్లో అవినీతి..**

కేంద్ర ప్రభుత్వ పెదమనుషులకు నచ్చని ఏకైక పదం నిజాయితేనంటూ నిలదీశారు.కేంద్ర ప్రభుత్వం మూడవసారి అధికారంలోనికి రాగా దేశ ప్రజల బతుకులు బాగుపడతాయేమోనని ఎంతగానో ఎదురుచూసిన పుణ్యాన కొత్త రకమైన అప్పుల భారాన్ని ప్రజలపై మోపుతూ దర్జాగా పెత్తనం చేస్తున్నారని హెచ్చరించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బిజెపి ప్రభుత్వం హామీల వైపు కనీసం కన్నెత్తి చూడకుండా ప్రైవేటు పరిశ్రమల ఆర్థిక లావాదేవీల పనులకు దేశ సొమ్మును ఎక్కువగా ఖర్చు చేస్తుందని తీవ్రంగా విమర్శించారు.ఏ శాఖలో చూసిన అవినీతి కుప్పలు కుప్పలుగా పెరిగిపోతుండగా భారతదేశ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా అవినీతిపరులు వేల కోట్లు లక్షల కోట్లు దుబారాగా దోచుకుంటున్నారని వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు మాత్రం భారతదేశాన్ని ఉద్ధరిస్తున్నామంటూ భారతదేశ ప్రజలకు సేవ చేస్తున్నామంటూ వాళ్ళు చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రశ్నించనివ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న పెద్ద పెద్ద మీడియాలను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సోషల్ మీడియాలను ఉపయోగించుకుంటూ బలవంతంగానైనా ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారే తప్ప ప్రజలపై మోపబడుతున్న ఆర్థిక భారాన్ని నియంత్రించడానికి ఏమాత్రం సహాయకరంగా పనిచేయలేకపోతున్నారని నిలదీశారు.భారత దేశంలో దోచుకోవడం బయట దేశాలలో వ్యాపారాలు చేయడం బిజెపి అనుబంధ పారిశ్రామికవేత్తలకు అలవాటుగా మారిపోయిందని గుర్తు చేశారు.దేశంలో బిజెపి ప్రభుత్వం ఏమాత్రం అవినీతికి పాల్పడడం లేదని దేశ ప్రజలను నమ్మించే ప్రయత్నంలో అబద్ధాలకు ఎగబడుతున్న బిజెపి పెద్దలు కేవలం 12 సంవత్సరాల్లోనే దేశ అప్పును సుమారుగా రెండున్నర లక్షల కోట్లకు చేరువయ్యేలా ఎందుకు చేశారంటూ నిలదీశారు.దేశంలో మరో అతిపెద్ద కుంభకోణం బయటపడిందని ఎల్ఐసి అవినీతి రూపంలో ప్రధానమంత్రి మోడీ సహచర మిత్రుడు అందాజా15 లక్షల కోట్లు లూటీ మాఫీ చేశాడని దేశమంతా బోరుణ విలపిస్తుంటే కేంద్ర ప్రభుత్వం మౌనాన్ని వహించడం సిగ్గుతో తలదించుకున్నట్లుగా ఉందన్నారు.దోచుకున్నది మావోడేగా లెక్కలు అడుగుతారు ఎందుకు అనే విధంగా కేంద్ర ప్రభుత్వం నాయకుల వ్యవహార శైలి కొనసాగుతూ ఉండడం విచారకరమన్నారు.దేశంలో ఆర్థిక సంక్షోభం జరుగుతున్న ప్రతి సందర్భంలో దేశ ఆర్థిక పరిస్థితి దివాలా తీయబడుతుందని దేశంలో ఆర్థిక వ్యవస్థ దివాలా తీసిన ప్రతి కంపెనీలో ప్రతి ఒక్కడు గుజరాతీయులై ఉంటాడని బ్యాంకుల నుండి రుణాలు తీసుకొని పారిపోయిన వాళ్లు కూడా గుజరాతీయులేనని దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిన ప్రతిసారి గుజరాతీయుల హస్తం పక్కగా ఉంటుందని ఇలాంటివన్నీ పసిగడుతున్న సందర్భంలో ఎస్ఈబిఐ సంస్థ వెల్లడించిన ఎల్ఐసి కుంభకోణం 15 లక్షల కోట్లు దాటిందని నిర్ధారించడం దేశ ప్రజల గుండెలపై పిడుగు లాంటి ఆర్థిక భారాన్ని వేసిందని గుర్తు చేశారు.దేశ సంపదను దోచుకొని విదేశాలలో పెట్టుబడులు పెట్టిన ప్రతి ఆర్థిక దోపిడీదారున్ని దేశ ప్రజలు గమనించాలని అదేవిధంగా దేశంలోని ఆర్థిక సంపదను దోచుకొని బ్యాంకులో రుణాలను దోచుకొని విదేశాలకు పారిపోయిన అవినీతి వ్యాపారస్తులను దేశంలోనికి తీసుకువచ్చి కఠినంగా శిక్షించాలని హెచ్చరించారు.వాళ్ల నుండి రావలసిన లక్షల కోట్ల రూపాయలను తిరిగి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు పది రూపాయలు లాభం చేయలేని ప్రభుత్వాలు వేలకోట్లు లక్షల కోట్లు అప్పనంగా దోచుకుంటున్న దుబారాగాల్లను దేశ ప్రయోజకులుగా చిత్రీకరించే కుట్రలు చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నబిన్నం చేయడమే కాకుండా లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తూ దేశ ప్రజలను నిండ ముంచుతున్నారని నిలదీశారు.దేశ ఆర్థిక వ్యవస్థ దిగజారి పోతుండగా దేశం అభివృద్ధి వేగంగా ముందుకు సాగుతుందని దుష్ప్రచారం చేసే చెత్త గాళ్లంతా దేశంలోని పేద ప్రజల ఇండ్లల్లో బుక్కెడంత అన్నం తింటే వాళ్ల జీవన విధానం ఏ విధంగా కొనసాగుతుందో అర్థమవుతుందన్నారు.మీడియా ముందు కూర్చుండి టీవీల ముందు కూర్చుండి పేపర్ రాతల ముందు కూర్చుండి సోషల్ మీడియా ముందు కూర్చుండి ప్రగల్బాలు పలకడం విమర్శించడం నిందించడం దూషించడము బూతులు తిట్టడం దాడులు చేయడం ఇవి తప్ప దేశంలో అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చెప్పండి అని అంటే ఏ ఒక్కడు సమాధానం చెప్పలేకపోతున్నారన్నారు.పైగా గ్యాస్ ధర 5000 అయినా మాకు సంబంధం లేదు దేశం నాశనం అయిపోయిన మాకు సంబంధం లేదు మేము మాత్రం గిట్నే బతుకుతామనే మొండి దారులకు కాలమే సమాధానం చెబుతుందని ఏది జరిగిన పేద ప్రజల ఆత్మగౌరవంపై పేద ప్రజల జీవన విధానంపై పేద ప్రజల సాధారణ బతుకులపై పెనుబారం లాంటి అప్పులను వేస్తూ పెనుబారం లాంటి ఆర్థిక భారాన్ని నింపుతూ వాళ్ళ బతుకులు బుగ్గిపాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం మాత్రం గద్దె దిగాల్సిందేనంటూ రూడీగా చెప్పారు.వందల కేసులు ఉన్నోడు వ్యాపారాలు చేసుకోవడానికి బయట దేశాలకు ఎలా పోగలుగుతున్నాడు అంటూ సూటిగా నిలదీశారు. అదే సందర్భంలో అత్యంత క్రిమినల్ కేసులు కలిగినోళ్లు దేశంలో ప్రధాన రాష్ట్రాలను పాలిస్తున్నారని దేశం ఎటువైపు పోతుందో ఎవరి నడిపిస్తున్నారో ఏం అర్థం కాలేని దిక్కుతోచని పరిస్థితిలో దేశ ఆర్థిక భారం పూర్తిగా పేదల పైన మాత్రమే పడుతుందన్నది వాస్తవం అన్నారు.




**కోట్ల జనాభాను కొంపలార్పుతున్నారు..**

దేశ ఆర్థిక భారం అధోగతి..

దేశ జనాభా 142 కోట్లు...

దేశ అప్పు లక్షల కోట్లలో పెరుగుతోంది...

ప్రజలపై పన్నుల భారం పెరుగుతోంది...

అయితే ప్రశ్నలు మాత్రం అలాగే ఉన్నాయని ప్రస్తావిస్తూ దేశం పై అప్పుల భారం ఏ విధంగా పెరిగిపోతుందో క్రింది విధంగా విశ్లేషించారు.

"ఈ అప్పంతా ఎక్కడ ఖర్చయింది..?

"ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వచ్చింది..?

"నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చాయా..?

"రైతు అప్పుల బాధ నుంచి బయటపడ్డాడా..?

"ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు ప్రపంచ స్థాయికి చేరాయా..?

" ధరలు సామాన్యుడికి అందుబాటులోకి వచ్చాయా..?

" పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గాయా..?

" పేదరికం పూర్తిగా తగ్గిపోయిందా..?

" మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక భారం తగ్గిందా..?

" కార్పొరేట్ సంస్థలపై నియంత్రణ పెరిగిందా..?

" బ్యాంకులకు వేల కోట్ల ఎగ్గొట్టిన వారి డబ్బులు తిరిగి వచ్చాయా..?

" ప్రభుత్వ రంగ సంస్థలు బలోపేతం అయ్యాయా..?

"రైల్వే, విద్య, వైద్యం పూర్తిగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మారాయా..?

"ప్రజల పేరుతో తీసుకున్న అప్పు...
ప్రజల జీవితాలను ఎంతవరకు మార్చింది..?

"దేశ సంపద పెరిగితే...
ఆ సంపద అందరికీ చేరిందా..?

"అభివృద్ధి జరిగితే...
ఆ అభివృద్ధి చివరి వ్యక్తి వరకు చేరిందా..?

ప్రశ్నించడం దేశద్రోహం కాదు...
ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం పౌరుని హక్కు.
ప్రశ్నలు చనిపోతే...
ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది.
ఆలోచించే సమాజమే అభివృద్ధి చెందుతుంది.
ప్రశ్నించే ప్రజలే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తారు.
"ప్రశ్న అనేది పుట్టకపోతే...
సమాధానం ఎప్పటికీ పుట్టదు."

దేశ ప్రజలారా మన బ్రతుకులు మనమే మార్చుకుందాం మన జీవితాలను మనమే బాగు చేసుకుందాం పోరాటాలకు సిద్ధపడదాం త్యాగధనుల జాబితాలో చేరిపోదాం మేధావులతో కలిసి దేశ రక్షణ పోరాటంలో కదం తొక్కుదాం అంటున్న భావితరానికి యువకులం రచయిత.

డాక్టర్ బరిగెల శివ
ఫౌండర్ చైర్మన్,జై భీమ్ టీవీ
జై భీమ్

# అంతర్జాతీయ స్థాయికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్‌తో ఎంఓయూ
పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

**రాజమహేంద్రవరం,జూన్9(జై భీమ్ న్యూస్) :**


ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింతగా విస్తరించే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఏపీ టూరిజం శాఖ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ మధ్య చరిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. విశాఖపట్నంలో సెప్టెంబర్ 10 నుంచి 12 వరకు 41వ ఐఏటీవో వార్షిక సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు. ఈ వార్షిక సదస్సు సందర్భంగా ఒప్పందం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా పర్యాటక రంగానికి చెందిన ప్రముఖులు, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొనే ఈ సదస్సు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకునుందని టూరిజం శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి విజన్‌కు అనుగుణంగానే ఐఏటీవోతో భాగస్వామ్యం ఏర్పడిందన్నారు. 41వ ఐఏటీవో వార్షిక సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం ఏపీకి గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. సీఎం ఆదేశాల మేరకు జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. విశాఖలో జరిగే ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలోని బీచ్‌లు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి సౌందర్య ప్రాంతాలు, వారసత్వ సంపద వంటి పర్యాటక విశేషాలు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం లభిస్తుందని మంత్రి దుర్గేశ్ చెప్పారు. ఒప్పందం ద్వారా ఏపీకి విదేశీ పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతుందని మంత్రి దుర్గేశ్ వివరించారు. సెప్టెంబర్‌లో జరిగే సదస్సుకు దాదాపు వెయ్యి మంది అంతర్జాతీయ టూరిజం ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక టూర్ ఆపరేటర్లకు ప్రోత్సాహంగా ఐఏటీవో సభ్యత్వ నమోదు ఫీజులో 50 శాతం ప్రత్యేక రాయితీ కల్పించడంతో పాటు రూ.10వేల జాయినింగ్ ఫీజును పూర్తిగా మినహాయించినట్లు దుర్గేశ్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పర్యాటక రంగంలో ఇప్పటికే రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వంపై పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరగడంతో భారీ ప్రాజెక్టులు ముందుకు వస్తున్నాయని మంత్రి దుర్గేశ్ చెప్పుకొచ్చారు. ఏపీలో పర్యాటక రంగం అభివృద్ధి చెందితే ఆర్థిక వృద్ధితో పాటు ఉపాధి అవకాశాలూ పెరుగుతాయని మంత్రి దుర్గేశ్ స్పష్టం చేశారు. ఈ సదస్సు జాతీయ ట్రావెల్ ట్రేడ్, పర్యాటక రంగ అగ్రనేతల సమక్షంలో ఏపీలోని వైవిధ్యభరితమైన పర్యాటక అవకాశాలను ప్రదర్శించేందుకు అరుదైన వేదికగా నిలవనుందని మంత్రి దుర్గేశ్ అభిప్రాయపడ్డారు.

# అధికారులు మారినా జోరు మారలేదు..!

**గదే తీరు... గదే తంతు..!**
**చాటుమాటున సమాచార హక్కు చట్టం**
**వెలుగులోకి రాని కొత్త అధికారుల పేర్లు**
**మండల రెవెన్యూ కార్యాలయం దళారులకు అడ్డాగా మారిందా..?**
**పేదలకు న్యాయం దక్కాల్సిన చోట కోర్టు మెట్లు ఎక్కిస్తున్న అధికారులు..?**
**సార్లు మారినా సంచులు మారుతలేవు..!**
**రెవెన్యూ అధికారుల సంచులు నింపుతున్నదెవరు..?**
**ఎవర్రా బిచ్చగాడు..? త్వరలో సంచలన వివరాలు**
**అధికారి మారినా.. ఆర్టీఐ బోర్డులో పేర్లు మాత్రం మారవు!**
**హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయంలో పాత అధికారుల వివరాలే దర్శనం**
**పాత అధికారిపై అంత ప్రేమ ఎందుకో..? అంటూ ప్రజల ప్రశ్న**

**హసన్‌పర్తి, 9 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలకు సకాలంలో సమాచారం అందించడం కోసం రూపొందించిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలు తీరుపై హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల తహసీల్దార్ కార్యాలయంలో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెవెన్యూ శాఖలో అధికారులు మారినా, బదిలీలు జరిగినా, బాధ్యతలు కొత్త అధికారులకు అప్పగించినా కార్యాలయంలో ప్రజలకు మార్గనిర్దేశం చేయాల్సిన ఆర్టీఐ బోర్డులు మాత్రం కాలం చెల్లిన సమాచారంతోనే కొనసాగుతున్నాయి. కార్యాలయంలో ప్రదర్శిస్తున్న సమాచార హక్కు చట్టం బోర్డుపై ఇప్పటికీ గతంలో విధులు నిర్వహించిన అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు కొనసాగుతుండగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారుల వివరాలు లేకపోవడం ప్రజలను అయోమయానికి గురిచేస్తోంది. సమాచారం కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు బోర్డులో ఉన్న నంబర్లకు ఫోన్ చేస్తే స్పందన లేకపోవడం, సంబంధిత అధికారులను సంప్రదించలేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారిగా పనిచేసిన రాథోడ్ రమేష్ బదిలీపై వెళ్లిపోయినప్పటికీ, కార్యాలయంలోని ఆర్టీఐ బోర్డుపై ఆయన పేరే కొనసాగుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అధికారుల మార్పులు జరిగిన నెలల తర్వాత కూడా బోర్డులను నవీకరించకపోవడం కార్యాలయ నిర్వహణలోని నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు.




సమాచార హక్కు చట్టం--2005 ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా సమాచార అధికారి (పిఐఓ), సహాయ ప్రజా సమాచార అధికారి (ఎపిఐఓ), మొదటి అప్పీలేట్ అథారిటీ వివరాలను స్పష్టంగా ప్రదర్శించాల్సి ఉంటుంది. అధికారులు మారిన వెంటనే ఆ వివరాలను సవరించడం సంబంధిత శాఖల బాధ్యత. కానీ హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఈ నిబంధనలను పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండల రెవెన్యూ కార్యాలయం పనితీరుపై కూడా ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆదాయ, కుల, నివాస, వారసత్వ ధ్రువపత్రాలు, భూ సంబంధిత సమస్యలు, మ్యుటేషన్ దరఖాస్తులు, పాస్‌బుక్ వ్యవహారాల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు నేరుగా అధికారులను కలిసే పరిస్థితి లేకుండా మధ్యవర్తుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు దళారులు కార్యాలయ పరిసరాల్లోనే మకాం వేసి ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. పేద ప్రజలకు న్యాయం చేయాల్సిన కార్యాలయాలు కొన్నిసార్లు వారిని కోర్టుల మెట్లు ఎక్కించే పరిస్థితి ఎందుకు వస్తోందని బాధితులు ప్రశ్నిస్తున్నారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, చివరికి న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు వాపోతున్నారు. ప్రభుత్వం పారదర్శక పాలన, అవినీతి రహిత పరిపాలన, ప్రజలకు సత్వర సేవలందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లక్షల రూపాయల జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండకుండా వ్యవహరించడం, సమాచారాన్ని ప్రజలకు చేరవేయాల్సిన వ్యవస్థలే నిర్లక్ష్యానికి గురికావడం పలు అనుమానాలకు తావిస్తోంది. "సార్లు మారినా సంచులు మారడం లేదు", "రెవెన్యూ అధికారుల సంచులు నింపుతున్నదెవరు?", "పేదల పనులకు ఆలస్యం ఎందుకు?", "ఆర్టీఐ బోర్డులు నవీకరించడానికి కూడా సమయం దొరకలేదా?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. "అధికారులు మారినా బోర్డులో పేర్లు ఎందుకు మారడం లేదు? పాత అధికారిపై అంత ప్రేమ ఎందుకో?" అంటూ స్థానికులు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయంలోని సమాచార హక్కు చట్టం బోర్డులను నవీకరించి, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న అధికారుల పేర్లు, హోదాలు, సంప్రదింపు వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే కార్యాలయాల్లో పారదర్శకత పెంపొందించి, దళారుల వ్యవస్థకు అడ్డుకట్ట వేసి, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. హసన్‌పర్తి రెవెన్యూ కార్యాలయ వ్యవహారాలపై, ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలు, పైసల వసూళ్ల దందా వెనుక ఉన్న అసలు కథనాలపై త్వరలో ప్రత్యేక పరిశోధనాత్మక కథనం...!

# అంబేద్కర్ రాజ్యాంగ శిల్పి: మాజీ సర్పంచుల నేత రాజిరెడ్డి



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

దేశానికి సమానత్వం. స్వేచ్ఛ. సౌబ్ర?త్రృత్వం కలిగిన రాజ్యాంగాన్ని రాసి ఇచ్చిన రాజ్యాంగ శిల్పి అంబేద్కర్ అని దోమ మాజీ సర్పంచుల నేత సర్పంచ్ కె రాజిరెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంలో ఈ నెల పదమూడో రోజు పూడూర్ మండలం మాటుగూడెం లో అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ కు సంబంధించి గోడ పత్రిక విడుదల కార్యక్రమం, అంబేద్కర్ సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. చదువుకు దూరం చేసిన సమాజం తో పోరాడిన ప్రపంచస్థాయి విద్యా వేత్త విగ్రహ ఆవిష్కరణకు దోమ మండలం నుండి అత్యధికంగా వెళదామని అన్నారు. ఈ కార్యక్రమం లో పరిగి నియోజకవర్గ అంబేద్కర్ సంగం నాయకులు మంచన పల్లి శ్రీనివాస్ రాములు ఆంజనేయులు డప్పు రమేష్ నర్సింలు బద్రి వెంకటయ విజయ్ కుమార్ రెడ్డి అంబేద్కర్ సంఘాల నాయకులు పెద్దలు పాల్గొన్నారు.

# మురికివాడల నివాసితులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి

**విద్యుత్ సరఫరా లేకపోవడంతో పిల్లలు విద్యలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు**



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరు నగరంలోని మహాదేవపుర నియోజకవర్గంలోని మరతహళ్లి సమీపంలో మురికివాడల 924 కుటుంబ నివాసితులు గత 100 రోజులుగా విద్యుత్ సరఫరా, కనీస సౌకర్యాల కొరతతో బాధపడుతున్నారని, ఈ సమస్యను జీబీఏ అధికారులు తక్షణమే పరిష్కరించాలని కర్ణాటక సామరస్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కన్నాలి కృష్ణప్ప డిమాండ్ చేశారు. మహాదేవపుర నియోజకవర్గంలోని మరతహళ్లి, అశ్వత్ నగర్ వార్డు 86, ఆనంద నగర్‌లోని 924 కుటుంబాలు మురికివాడల అభివృద్ధి బోర్డు ఇళ్ల నివాసితులు గత 100 రోజులుగా విద్యుత్ సరఫరా, సౌకర్యాలు లేక ప్రాథమిక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**స్లం బోర్డు నిర్మించిన ఇళ్లలోని పేద దళితులు**

సౌకర్యాల కొరత, సంబంధిత శాఖల నుండి అందే సేవలు సరిగా లేకపోవడం వల్ల వారు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు తాగునీటి సమస్య ఉండగా, మరోవైపు బోర్‌వెల్స్ ద్వారా నీటి సరఫరాకు అంతరాయం, గత 100 రోజులుగా విద్యుత్ లేదు. బెస్కామ్ అధికారులను అడిగితే, మీటర్ లేకుండా కనెక్షన్ ఇవ్వలేమని చెబుతున్నారు. ఎక్కువగా నిరక్షరాస్యులు, అణగారిన వర్గాలు నివసించే ఆ ప్రాంత ప్రజలు, తమ సమస్యల కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, మురుగునీటి కాలువలు శిథిలావస్థలో ఉన్నాయి. రోడ్లకు డంబార్ వేయాలి. డ్రైన్లు, పూడికతీత పనులు చేయాలి. ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గతంలో మారతహళ్లి స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాల విస్తరణ కూడా హెచ్‌ఏఎల్ పరిధిలోకి వస్తుంది, కాబట్టి సరైన పర్యవేక్షణ అవసరం. మురికివాడ ప్రాంత నివాసితుల ప్రయోజనాల దృష్ట్యా, 3 బోర్‌వెల్స్‌కు నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని, రోడ్లను అభివృద్ధి చేయాలని, సీసీ కెమెరాలను సక్రమంగా నిర్వహించాలని, స్థానిక నివాసితులకు సహాయపడాలని కోరుతూ మహాదేవపుర జీబీఏ డివిజన్ డిప్యూటీ కమిషనర్‌కు ఒక విజ్ఞప్తిని సమర్పించడం జరిగింది. ఈ విజ్ఞప్తిని మంత్రి జార్జ్, జీబీఏ మహాదేవపుర సబ్-డివిజన్ కమిషనర్, స్లమ్ బోర్డ్ కమిషనర్‌కు సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గంగన్న, ఉమ, ముని, పార్వతమ్మ, కాశీసభీ మరియు కర్ణాటక సామరస్య సమితికి చెందిన ఇతర కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖేతీ బచావో అభియాన్‌తో రైతుల్లో చైతన్యం

**సమతుల్య ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, సమీకృత సాగు విధానాలపై విస్తృత అవగాహన**
**వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 16 గ్రామాల్లో 4,800 మంది రైతులకు శిక్షణ**

**వరంగల్, 9 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వ్యవసాయ భూముల సారాన్ని కాపాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన "ఖేతీ బచావో అభియాన్" కార్యక్రమాన్ని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వరంగల్, హనుమకొండ జిల్లాల్లో విస్తృతంగా నిర్వహిస్తోంది. జూన్ 1 నుంచి 30 వరకు కొనసాగుతున్న ఈ కార్యక్రమం ద్వారా రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, సమగ్ర పంట సంరక్షణ, పశుసంపద మరియు మత్స్య సమీకృత వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు రెండు జిల్లాల్లోని 16 గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సుమారు 4,800 మంది రైతులు పాల్గొని శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను తెలుసుకుని ప్రయోజనం పొందినట్లు కేవీకే అధికారులు తెలిపారు. జూన్ నెలాఖరు వరకు మరిన్ని గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించి అధిక సంఖ్యలో రైతులకు ఖేతీ బచావో అభియాన్ సందేశాన్ని చేరవేయనున్నట్లు వెల్లడించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డా. ఆర్. అరుణ్ జ్యోతి మాట్లాడుతూ ప్రస్తుతం అధికంగా రసాయన ఎరువుల వినియోగం వల్ల నేల సారవంతత తగ్గిపోవడంతో పాటు పంటల ఉత్పాదకత కూడా క్రమంగా క్షీణిస్తోందన్నారు. రైతులు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకుని, మట్టి ఆరోగ్య కార్డు (సాయిల్ హెల్త్ కార్డ్) ఆధారంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. సేంద్రియ ఎరువులు, హరిత ఎరువులు, పంట అవశేషాల నిర్వహణ, సూక్ష్మపోషకాల వినియోగం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త (అగ్రానమీ) డా. చి. సౌమ్య మాట్లాడుతూ నత్రజని, భాస్వరం, పొటాష్ (ఎన్‌పీకే) ఎరువులను సమతుల్య నిష్పత్తిలో వినియోగించడం ద్వారా పంట దిగుబడులు పెరగడమే కాకుండా ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. ఎరువులను విడతల వారీగా వేయడం, జీవ ఎరువులు, సూక్ష్మపోషకాలను అవసరానికి అనుగుణంగా వినియోగించడం ద్వారా నేల సారం దీర్ఘకాలం నిలుపుకోవచ్చని చెప్పారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు విధానాలను మార్చుకోవాలని రైతులకు సూచించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డా. అగుర్ల రాజు మాట్లాడుతూ ఖేతీ బచావో అభియాన్ ప్రధాన ఉద్దేశ్యం పంటలను, నేలను, పర్యావరణాన్ని రక్షించడమేనని తెలిపారు. సమగ్ర పంట సంరక్షణ (ఐపీఎం), జీవ నియంత్రణ పద్ధతులు, ఫెరోమోన్ ట్రాప్స్, స్టిక్కీ ట్రాప్స్, వేప ఆధారిత ఉత్పత్తులు, జీవ పురుగుమందుల వినియోగాన్ని రైతులు ప్రోత్సహించాలని సూచించారు. ఆర్థిక నష్ట స్థాయి (ఈటీఎల్) దాటిన తర్వాత మాత్రమే అవసరమైన రసాయన పురుగుమందులను సిఫారసు చేసిన మోతాదులో ఉపయోగించాలని పేర్కొన్నారు. సహజ వ్యవసాయ పద్ధతులైన జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం వంటివి వినియోగించడం ద్వారా సాగు వ్యయం తగ్గడంతో పాటు నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. పశుసంవర్ధక శాస్త్రవేత్త డా. జె. సాయి కిరణ్ మాట్లాడుతూ పంటలు, పశుపోషణ సమీకృత వ్యవసాయ విధానం రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందని తెలిపారు. పశువుల పేడ, గోమూత్రంతో జీవ ఎరువులు తయారు చేసి



వ్యవసాయంలో వినియోగించడం ద్వారా రసాయన ఎరువులపై ఆధారపడటం తగ్గుతుందని చెప్పారు. పశువులకు సమతుల్య దాణా, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. మత్స్య శాస్త్రవేత్త డా. జి. గణేష్ మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు మత్స్య సాగును అనుసంధానం చేయడం ద్వారా రైతులు ద్విగుణీకృత ఆదాయాన్ని పొందే అవకాశం ఉందన్నారు. చెరువుల నీటిని వ్యవసాయానికి, వ్యవసాయ ఉప ఉత్పత్తులను చేపల పెంపకానికి వినియోగించడం ద్వారా వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. సమీకృత వ్యవసాయ విధానాలు గ్రామీణ రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని వివరించారు. రైతులు నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయ పద్ధతులు మరియు సమీకృత వ్యవసాయ విధానాలను అనుసరించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఖేతీ బచావో అభియాన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై శాస్త్రీయ అవగాహన పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు అందుతుందని తెలిపారు.

# సీకేఎం "సీను"పై సర్వత్ర విమర్శలు




**సీకేఎం డిగ్రీ,పీజీ కళాశాలలో పారదర్శకతపై ప్రశ్నలు.. సమగ్ర విచారణకు డిమాండ్**
**నిజాలు రాసినా వారి పైన నిందలు వేస్తారా?**
**కళాశాలలో జాబ్ లు అడిగింది ఎవరు?**
**బహిరంగ చర్చకు సిద్ధమా?**
**జై భీమ్ ప్రతినిధి సవాల్ !**
**ప్రిన్సిపల్ మౌనం పలు అనుమానాలకు తావిస్తోంది - విద్యార్థి సంఘాలు**

**వరంగల్ / జై భీమ్ న్యూస్ :**

వరంగల్ మహానగరంలో విద్యా రంగానికి చిరునామాగా నిలిచిన సీకేఎం డిగ్రీ , పీజీ కళాశాల వ్యవహారాలపై ఇటీవల పలు ప్రశ్నలు వెలువడుతున్నాయి. కళాశాల పరిపాలన, ఆర్థిక లావాదేవీలు, నియామక ప్రక్రియలు, అభివృద్ధి పనులపై సమగ్ర విచారణ జరపాలని విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యా మేధావులు కోరుతున్నారు. గత 15 సంవత్సరాల కాలంలో కళాశాల అభివృద్ధి, విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు, అధ్యాపక , సిబ్బంది ఖర్చులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులపై స్వతంత్ర కమిటీతో క్షేత్రస్థాయి ఆడిట్ నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే 2003 సంవత్సరానికి ముందు తరువాత జరిగిన నియామకాల ప్రక్రియ, నియామకాల సమయంలో అనుసరించిన అర్హతలు, నిబంధనల అమలుపై కూడా నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కళాశాల వ్యవహారాలకు సంబంధించి ఇటీవల కొన్ని అంశాలు మీడియాలో వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, ప్రిన్సిపల్ వాటిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కళాశాలకు సంబంధించిన అంశాలపై వార్తలు ప్రచురించిన జర్నలిస్టు పై ఒత్తిళ్లు, విమర్శలు, ఫోన్ కాల్స్ ద్వారా ఇబ్బందులు కల్పిస్తున్నారనే ఆరోపణలపై కూడా విచారణ జరపాలని కోరుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా ప్రశ్నించడం, ప్రజా సంస్థల పనితీరుపై చర్చ జరగడం సహజ ప్రక్రియ. అందువల్ల వచ్చిన ఆరోపణలు, అనుమానాలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని, అవసరమైతే సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు వెల్లడించాలని విద్యార్థి సంఘాలు, ప్రజా నాయకులు, విద్యా వేత్తలు కోరుతున్నారు. కళాశాల ప్రతిష్టను కాపాడేందుకు పారదర్శకత, జవాబుదారీతనం, వాస్తవాధారిత విచారణే సరైన మార్గమని వారు అభిప్రాయపడుతున్నారు.

ధర్మన్న ధర్మం తప్పుతాడా ..
శీనన్న చిందులు వేస్తాడా ...

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ పోలీస్ కమిషనర్



**జనగామ, 9 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

జనగామ జిల్లా చిల్పూర్ మండలం పల్లగూడ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉప ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కార్యక్రమాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ప్రజల భాగస్వామ్యంపై సంక్షిప్తంగా చర్చించారు. పల్లగూడ గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించడంతో పాటు కొత్త పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

# ఆటోలో మరిచిపోయిన బంగారం స్వాధీనం.. కేయూసీ పోలీసుల చాకచక్యం

**బాధితురాలికి అప్పగించిన కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్**






**కేయూసీ, జూన్ 9 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ఆటోలో మరిచిపోయిన బంగారు ఆభరణాలు, నగదు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తించి బాధితురాలికి అప్పగించి కేయూసీ పోలీసులు తమ చాకచక్యాన్ని చాటుకున్నారు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు చెందిన వనం రేణుక (60) ఈ నెల 4వ తేదీన హనుమకొండలోని స్నేహనగర్ నుంచి సప్తగిరి కాలనీకి ఆటోలో వెళ్లి దిగిన అనంతరం తన హ్యాండ్ బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయింది. ఆ బ్యాగ్‌లో రెండున్నర తులాల బంగారు గొలుసు, రూ.3 వేల నగదు, ఆధార్ కార్డు, ఏటీఎం కార్డులు ఉన్నాయి. విషయాన్ని గుర్తించిన బాధితురాలు అదే రాత్రి కేయూసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్ వెంటనే స్పందించి దర్యాప్తు చేపట్టారు. ఆయన ఆదేశాల మేరకు క్రైమ్ సిబ్బంది ఐదు రోజుల పాటు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి, ఆటో ఆచూకీ కనుగొని డ్రైవర్ వివరాలను సేకరించారు. అనంతరం ఆటోలో మిగిలిపోయిన హ్యాండ్ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని అందులోని బంగారు ఆభరణాలు, నగదు, ఇతర పత్రాలతో సహా బాధితురాలికి అప్పగించారు. పోయిన విలువైన వస్తువులు తిరిగి లభించడంతో వనం రేణుక ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కేసు పరిష్కారంలో విశేష కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ ఎం.డి. అహ్మద్ పాషా, కానిస్టేబుల్ జె. రాజశేఖర్‌లను ఇన్‌స్పెక్టర్ ఎస్. రవికుమార్ అభినందించారు.

# స్లం నివాసితులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కర్ణాటక కెపిసిసి అధ్యక్షుడిని కలిసినా : కన్నల్లి కృష్ణప్ప

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరు నగరంలోని మహాదేవపుర నియోజకవర్గంలోని మరతహళ్లి సమీపంలో మురికివాడల 924 కుటుంబ నివాసితులు గత 100 రోజులుగా విద్యుత్ సరఫరా, కనీస సౌకర్యాల కొరతతో బాధపడుతున్నారని, ఈ సమస్యను జీబీఏ అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతూ కర్ణాటక సామరస్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కన్నాలి కృష్ణప్ప కర్ణాటక ప్రభుత్వం ప్రకటించిన కెపిసిసి అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన బి కె హరిప్రసాద్ ను కలిసి వినతి పాత్రం సమర్పించారు.



# "దట్ ఇస్ సీపీ"




**ప్రజాసేవలో ప్రధానులు**
**పోలీసుల సాంకేతిక పవర్ చూపిస్తున్నారు**
**అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నారు**
**పోలీస్ విశ్వాసాన్ని ప్రజల్లో బలపరుస్తున్నారు**
**రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గన అధికారి**
**సీపి నిజాయితీ రాజకీయ నాయకులకు పొరుసూగడంలేదు**
**ప్రజలు పోలీస్ సేవలను ఉపయోగపరచుకునేలా చేస్తున్నారు**
**పోలీస్ శాఖలో సహజ సిద్ధమైన శైలిని ప్రదర్శిస్తున్నారు**

**వరంగల్ పోలీస్ శాఖ జై భీమ్ న్యూస్:-**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలు పోలీస్ శాఖ సేవలపై విశ్వాసాన్ని పెంచుకోవడానికి సాధ్య అసాధ్యాలను పక్కనపెట్టి పూర్తి బాధ్యతను కనపరుస్తున్న వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ వరంగల్ పోలీస్ శాఖలో తన ప్రత్యేకతను చాటుకుంటున్నారని మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ప్రతి పోలీస్ స్టేషన్ సందర్శిస్తూ ఆయా పోలీస్ స్టేషన్లోని పరిధిలో గల ప్రజల స్థితిగతులను ముందస్తుగానే తెలుసుకొని స్టేషన్స్ అధికారులకు ప్రజల పట్ల ఏ విధంగా ఉండాలో సందర్భాలను బట్టి సూచనలు తెలియజేస్తూ ఉండడం ప్రజా ప్రయోజనాలను బలపరుస్తున్నట్లుగా ఉందని వరంగల్ ప్రజలు అభిమానం వ్యక్తపరుస్తున్నారు.వరంగల్ సీపి నిజాయితీని తట్టుకోలేని కొంతమంది రాజకీయ నాయకులు వాళ్లకు సంబంధించిన భూకబ్జాల పైరవీలు జరగడంలేదని భావిస్తూ సీపిని బదిలీ చేయించాలనే కుట్రలు జోరుగా కొనసాగిస్తుండడం నగరంలో తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది.ప్రజలకు సేవలు చేయాల్సిన రాజకీయ నాయకులు ప్రజా సేవకు అనుకున్నంత చేయూతను ఇవ్వకపోవడం వల్ల ప్రజాసేవకు సర్వం తానై బాధ్యత వహిస్తున్న సీపి సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ సేవలకు విగాతం కలిగించాలనే ప్రయత్నాలు చేస్తుండడం రాజకీయ అధికార బలాన్ని స్టేషన్ల పై ప్రయోగిస్తూ పోలీసు ఉన్నతాధికారి రూపంలో పేద ప్రజలకు జరుగుతున్న ప్రజాసేవను దూరం చేసే విధంగా రాజకీయాలు చేస్తున్న కొంతమంది రాజకీయ నాయకులు వాళ్ల స్వార్థ ప్రయోజనాలకోసం ప్రజాసేవకు విగాథం కలిగిస్తున్నట్లుగా ఉందని ప్రజలు భావిస్తున్నారు.రాజకీయ నాయకుల వేధింపులు తట్టుకోలేక ఇబ్బంది పడుతున్న ప్రజలందరికీ వరంగల్ సిపి సేవలు పొందుకుంటూ పలు క్లిష్టమైన సమస్యల నుండి విముక్తి పొందుతున్నారు.కొంతమంది పోలీసు అధికారులు పలు స్టేషన్లో పోస్టింగులు కాపాడుకోవడం కోసం రాజకీయ నాయకులను విపరీతంగా అనుసరిస్తూ రాజకీయ నాయకులు పోలీస్ శాఖ విలువలను తాకట్టు పెట్టే ప్రయత్నాలు చేస్తుండగా వాటన్నిటిని ఏమాత్రం సహించని పోలీస్ కమిషనర్ రాజకీయాలు వేరు ప్రజాసేవ వేరు,పోలీస్ శాఖ వేరు ప్రజల బాగోగులు వేరు అనే సిద్ధాంతాలపై ప్రజలలో ఏర్పడుతున్న భిన్నమైన ఆలోచనలో పడిపోతున్న ప్రజలకు ప్రతి సందర్భంలో పోలీస్ శాఖ కార్యక్రమాలతో ఎంతటి లోతైన, ఎంతటి మెరుగైన సేవలను అందించగలమో చేసి చూపిస్తున్నారు.హైదరాబాద్ తర్వాత రెండవ అతి ప్రధానమైన అతి ప్రాముఖ్యమైన అతి విశాలవంతమైన నగరంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకమైన గుర్తింపు కలదని తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల ప్రజల కన్నా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు అన్ని రకాల విలువలను ప్రదర్శించగలరని అలాంటి మేధస్సు అలాంటి సంపన్నులను అలాంటి రాజకీయ పరిజ్ఞానమంతమైన వ్యక్తులను మేధావులను ఉద్యమకారులను అందర్నీ కలిపి పోలీసు సేవలలోని సమాన హక్కులకు దగ్గర చేస్తూ,యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా లెక్కలేనన్ని అవగాహన సదస్సు కార్యక్రమాలను తన సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నారు. నేర్పరితనాన్ని ప్రదర్శిస్తున్న రాజకీయ నాయకులకు తనదైన శైలిలో పరిపాలన పరంగా సమాధానం చెబుతూ,ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కొనసాగించబడుతున్న భూకబ్జాలపై ప్రత్యేకమైన చర్యలు చేపడుతూ పోలీస్ అధికారులను భూకబ్జాల వైపు వెళ్లకుండా జాగ్రత్త వహిస్తున్నారని ఆయినప్పటికీ స్టేషన్స్ అధికారులు రాజకీయ నాయకుల ప్రలోభాలకు, తాయిళాలకు పోలీస్ పోస్టింగ్లకు వ్యక్తిగత లావాదేవీలకు అలవాటు పడిపోయి సీపి సహజ సిద్ధమైన ఆలోచనలను ప్రణాళికలను ప్రజల వైపు మళ్ళించబడకుండా దారి తప్పిస్తున్నారని అలాంటి వాళ్ళపై ఉక్కు పాదం మోపడానికి సీపి ఎక్కడ వెనకాడడం లేదని వరంగల్ ప్రజలు అభినందిస్తున్నారు.ప్రజలకు మేలు చేయకుండా ప్రజలకు కీడు చేస్తూ రాజకీయ ప్రలోభాలకు ప్రజలు గురి చేయబడే రాజకీయాల వైపు ప్రాధాన్యతనిస్తున్న పోలీస్ అధికారుల జాబితాలను ప్రత్యేకంగా సిద్ధపరచుకొని గుట్టు చప్పుడు కాకుండా వాళ్ళ భరతం పడుతూ వాళ్లపై ప్రత్యేకమైన నివేదికలను సిద్ధం చేసుకుంటున్నారని విశ్వాసనీయ సమాచారం.ఒక పోలీస్ ఉన్నతాధికారిగా గత సీపి రంగనాథ్ ఐపీఎస్ వరంగల్ భూకబ్జాల భరతం పట్టి ప్రజల వైపు రక్షణగా నిలిచి ఎంతటి ప్రత్యేకతనైతే సంపాదించుకున్నారో అదే ధోరణిలో అదే తరహాలో ప్రస్తుత సీపి సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ పోలీస్ శాఖను రాజకీయాలకు అతీతంగా ప్రతి పోలీస్ స్టేషన్లో పేద ప్రజలకు సేవలు అందించబడేలా ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా పోలీస్ సేవలను ప్రజల ఇంటి వద్ద నుండే కొనసాగించబడే విధంగా తీవ్రంగా కృషి చేస్తూ మరొక ప్రత్యేకమైన గుర్తింపును సాధిస్తున్నారని ప్రజలు అభినందిస్తున్నారు.రాజకీయా నాయకుల ఒత్తిల్లను తట్టుకొని ప్రజలకు అనుకున్న దానికన్నా ఎక్కువగా సేవలు అందించడం పోలీస్ ఉన్నతాధికారిగా తన బాధ్యతను విశ్వాసాన్ని తన ఆత్మ గౌరవాన్ని,అన్నింటికన్నా మించి తన నిజాయితీని ప్రజల మధ్యలో పేద ప్రజల సేవలో అత్యధికముగా బలపరుచుకుంటున్నందునే రాజకీయాలను పక్కనపెట్టి అధికార బదిలీలను పక్కనపెట్టి ఉమ్మడి వరంగల్ జిల్లాకు అన్ని విధాలుగా సరిపడేటువంటి పోలీస్ ఉన్నత అధికారిగా వ్యక్తిగత పేరు ప్రతిష్టల కన్నా రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వానికి కీర్తి ప్రతిష్టలు పతీసుకొచ్చే విధంగా రాష్ట్ర పోలీస్ శాఖ గౌరవాన్ని పెంచుతూ ప్రజల మనోభావాలను ప్రజల ఆలోచనలను ప్రజాసేవగా మలుస్తూ ప్రజలతో మమేకమై ప్రజాసేవ కార్యక్రమాల్లో ముందుకు సాగుతున్నారని ఇలాంటి అధికారిపై ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజల విశ్వాసం అంచలంచలుగా అంతుచిక్కని విధంగా పెంచబడుతూనే ఉందని ప్రజలంతా అర్థం చేసుకుంటూనే ఉంటుండగా ఇలాంటి పోలీసు ఉన్నతాధికారి ప్రజలకు ఎక్కువశాతం మేలు చేసే విధంగా తనను వరంగల్ లోనే కొనసాగించే విధంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి రాష్ట్ర డిజిపి ప్రత్యేకమైన చొరవ తీసుకొని ప్రజల మేలు కోరాలని తెలుపునైనది.

# అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

**ఎలుకల మందు తాగి చికిత్స పొందుతూ మృతి**




**కమలాపూర్, 9 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

అప్పుల బాధ భరించలేక ఓ యువకుడు ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కమలాపూర్ మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం పగిడిపల్లి గ్రామానికి చెందిన నాగుల రాకేష్ (30) కమలాపూర్‌లో మొబైల్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి మద్యానికి అలవాటు ఉండటంతో పాటు వివిధ అవసరాల కోసం సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేసినట్లు సమాచారం. ఇటీవల అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురైన రాకేష్ ఈ నెల 3వ తేదీన సాయంత్రం తన కొత్త ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కమలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# హనుమకొండ జిల్లాకు 12 నూతన ఎలక్ట్రిక్ బస్సులు

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహిళా సంఘాలకు అందజేత**

**హన్మకొండ, 9 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా హనుమకొండ జిల్లాకు 12 నూతన ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించబడినట్లు అధికారులు తెలిపారు. ఈ బస్సులను మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన మహిళా శక్తి మహాసభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన మహిళా శక్తి మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు కేటాయించిన బస్సులను ప్రారంభించారు. హనుమకొండ జిల్లాలోని 12 మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని మండలాల నుంచి సుమారు 600 మంది మహిళా సంఘాల సభ్యులు ప్రత్యేక ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్‌కు చేరుకున్నారు. ప్రతి బస్సులో మహిళా సంఘాల సభ్యులతో పాటు ఏపీఎంలు, మహిళా పోలీసులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ బస్సులను మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించడం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబనకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మేన శ్రీను, అదనపు డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, వివిధ మండలాల ఏపీఎంలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.




# ఓరుగల్లు గుండె చప్పుడిగా మారుతున్న విష్ణువర్ధన్ రెడ్డి

**యువ నాయకత్వానికి కొత్త నిర్వచనం**

**హన్మకొండ / జై భీమ్ న్యూస్ :**

చరిత్రకు చిరునామాగా నిలిచిన ఓరుగల్లు నేలపై ప్రతి కాలంలోనూ ప్రజల హృదయాలను గెలుచుకున్న నాయకులు పుట్టుకొచ్చారు. నేడు అదే వరుసలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటూ, యువత ఆశలకు ప్రతీకగా, పేదల ఆత్మీయుడిగా, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించే నాయకుడిగా విష్ణువర్ధన్ రెడ్డి ఎదుగుతున్నారని అనేక మంది ప్రజలు అభిప్రాయపడుతున్నారు. విదేశాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు, సౌకర్యవంతమైన జీవితం ఉన్నప్పటికీ వాటన్నింటినీ పక్కనబెట్టి ప్రజా సేవనే తన జీవిత లక్ష్యంగా ఎంచుకోవడం ఆయనలోని సేవా దృక్పథానికి నిదర్శనమని ఆయన అభిమానులు చెబుతున్నారు. ప్రజల మధ్యే ఉండాలి.. ప్రజల సమస్యలే తన సమస్యలుగా భావించాలి అనే ఆలోచనతో ప్రతి రోజు ప్రజల్లో తిరుగుతూ వారి అవసరాలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. వరంగల్ నగరంలో ఏ ప్రాంతానికి వెళ్లినా యువత, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారవేత్తలతో మమేకమవుతూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేస్తూ ఫలితాలు సాధించే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రత్యేకంగా యువతపై ఆయన చూపుతున్న శ్రద్ధ ప్రశంసనీయమని పలువురు విద్యార్థి నాయకులు పేర్కొంటున్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్ మేళాలు నిర్వహించడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, ఉన్నత విద్య కోసం మార్గదర్శనం చేయడం వంటి కార్యక్రమాల ద్వారా వేలాది మంది యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చూడటం, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి సహాయం అందించడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, విద్యకు దూరమైన పిల్లలను తిరిగి విద్యా వ్యవస్థలోకి తీసుకురావడానికి కృషి చేయడం వంటి కార్యక్రమాలు ఆయనను సామాన్య ప్రజలకు మరింత చేరువ చేశాయి. వరంగల్ నగర అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన, భవిష్యత్ ప్రణాళికలపై దృష్టి, నగర అవసరాలపై పట్టు సాధిస్తూ విష్ణువర్ధన్ రెడ్డి క్రమంగా ఓరుగల్లు రాజకీయాల్లో తనదైన స్థానం ఏర్పరచుకుంటున్నారని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. నగరంలోని ప్రతి వర్గంతో అనుబంధం పెంచుకుంటూ ప్రజా సమస్యలపై స్పందించే నాయకుడిగా ఎదుగుతున్నారు. డ్రగ్స్ నిర్మూలన, యువతలో సామాజిక బాధ్యత పెంపు, ఆరోగ్య అవగాహన, విద్యా ప్రోత్సాహం, క్రీడల అభివృద్ధి వంటి అంశాలపై ఆయన చేపడుతున్న కార్యక్రమాలు యువతను ఆకర్షిస్తున్నాయి. సమాజాన్ని ప్రభావితం చేసే సమస్యలపై యువతను భాగస్వాములను చేస్తూ సానుకూల మార్పుకు కృషి చేస్తున్నారు. హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ, నగర అభివృద్ధి లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే నిజమైన నాయకత్వమనే భావనతో పనిచేస్తున్నారని పేర్కొంటున్నారు. నేటి రాజకీయాల్లో ప్రజలకు దగ్గరగా ఉండే నాయకులు అరుదుగా కనిపిస్తున్న సమయంలో, ప్రజల మధ్యే ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామి అవుతున్న యువ నాయకుడిగా విష్ణువర్ధన్ రెడ్డి గుర్తింపు పొందుతున్నారు. వరంగల్ నగరంపై పట్టు సాధిస్తూ, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ, సేవనే తన రాజకీయ తత్వంగా ముందుకు సాగుతున్న నాయకుడిగా ఆయన ఎదుగుదలపై ఓరుగల్లు ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతోంది. “నాయకత్వం పదవితో రాదు.. ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నప్పుడే వస్తుంది. ఆ స్థానాన్ని సేవతో సాధించేందుకు అడుగులు వేస్తున్న యువ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి” అని పలువురు సామాజిక వర్గాల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.




# నైరుతి ఆగమనంతో పలకరించిన తొలకరి

**హైదరాబాద్ నగరంలో ఉరుములతో భారీ వర్షం**
**ఎప్పటిలాగే లోతట్టు ప్రాంతాలు జలమయం**
**అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక**

**హైదరాబాద్, జూన్9(జై భీమ్ న్యూస్) :**

తొలకరి పలకరించింది. నైరుతి ప్రవేశంతో హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరంలో పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు రామ్‌నగర్‌లోని వీఎస్టీ రోడ్డులో భారీ వృక్షం నేలకొరిగింది. అలాగే, హైదర్‌గూడలోనూ ఓ భారీ వృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పలుచోట్ల రహదారులపై వర్షం నీరు చేరింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. భాగ్యనగరంలో భారీ వర్షం కురుస్తోండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సిటీలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా లోతట్టు కాలనీలు, ప్రధాన రహదారులు, కూడళ్లలో నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, టోలీచౌకి, ఫిలింనగర్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా, కొన్ని చోట్ల ట్రాఫిక్ జాం అయింది. కార్యాలయాలు, విద్యాసంస్థల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రజలు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు మరికొన్ని గంటల పాటు నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాల ప్రభావంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణలో బుధవారం కూడా పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నేడు అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు పడొచ్చని పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాలకు మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు తెలిపిన వాతావరణ శాఖ అధికారులు.. కామారెడ్డిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, బుధవారం వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై రాజకీయాలా?

**వైసిపి తీరుపై మండిపడ్డ ఎంపి కలిశెట్టి**

**విశాఖపట్నం, జూన్9(జై భీమ్ న్యూస్) :**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రమాద ఘటనపై వైసీపీ వ్యవహరిస్తున్న తీరు పట్ల విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మండిపడ్డారు. నాడు ఎల్‌జీ పాలిమర్స్ బాధితులను గాలికొదిలేసిన వైసీపీ.. నేడు స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, శాశ్వత ఉద్యోగం ఇచ్చిన మానవతా ప్రభుత్వం ఈ కూటమి సర్కారు అని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పారిశ్రామిక రక్షణ గాల్లో దీపమైతే.. నేడు బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కాకుండా కాపాడేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అహర్నిశలూ శ్రమిస్తున్నారని గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన దురదృష్టకర ప్రమాదాన్ని కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటూ, ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న శవరాజకీయాలను ఈ సందర్భంగా ఆయన ఖండించారు. వైసీపీ ఐదేళ్ల తుగ్లక్ పాలనలోని పారిశ్రామిక నిర్లక్ష్యాన్ని గుర్తు చేస్తూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమంతోపాటు స్టీల్ ఎ÷-లాంట్ మనుగడ కోసం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని ఆయన వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీకేజీ ఉదంతాన్ని ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వివరించారు. ఆ సమయంలో సీఎం వైఎస్ జగన్ వ్యవహరించిన తీరును ఆయన ఎండగట్టారు. అందుకు భిన్నంగా ప్రస్తుతం కూటమి సర్కార్ స్పందించిందని గుర్తు చేశారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మిక సోదరుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన పరిహారం దేశ పారిశ్రామిక చరిత్రలోనే ఒక రికార్డు అని అభివర్ణించారు. ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి వివరించారు. ?ఇంతటి ఉదారతతో కార్మిక లోకానికి అండగా నిలిచిన కూటమి ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి.. వైసీపీ నేతలు సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని ఎంపీ కలిశెట్టి నిప్పులు చెరిగారు. విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణను పక్కన పెట్టి.. దాని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలను ఎంపీ కలిశెట్టి సోదాహరణగా వివరించారు. ఈఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని ఆయన పేర్కొన్నారు.

## బాసరలో విషాద ఘటన

**నిర్మల్,జూన్9(జై భీమ్ న్యూస్) :**

బాసరలో మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి వెళ్లిన ముగ్గురు భక్తులు ప్రమావదశాత్తూ గోదావరి నదిలో గల్లంతయ్యారు. హైదరాబాద్‌లోని కాచిగూడ చప్పల్ బజార్‌కు చెందిన ఓ కుటుంబం.. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయానికి వెళ్లారు. అయితే, దర్శనానికి ముందు పుణ్యస్నానాలు ఆచరించేందుకు కుటుంబ సభ్యులు గోదావరి నదిలోకి దిగారు. లోతును సరిగ్గా అంచనా వేయలేకపోవడంతో బాధిత కుటుంబానికి చెందిన ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. కాగా, గల్లంతైన చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31) అన్నదమ్ములుగా తెలుస్తోంది. ఈ ప్రమాదాన్ని గమనించిన గజ ఈతగాళ్లు.. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అన్నదమ్ములు ముగ్గురు నీటిలో మునిగిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారిని సురక్షితంగా కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు. మరోవైపు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి బయలుదేరారు.

## గంజాయి పార్టీ పై పోలీసుల దాడి

**హైదరాబాద్,జూన్9(జై భీమ్ న్యూస్) :**

నగరంలోని పాతబస్తీ చంద్రాయణగుట్ట బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి పార్టీపై పోలీసులు దాడులు చేశారు. క్రిస్టల్ టౌన్‌షిప్‌లోని ఓ ఇంటిలో గంజాయి పార్టీ జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించి... ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు 220 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఊటీ, కొడైకెనాల్ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది.

# స్టీల్ ప్లాంట్ మృతుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం

**గాయపడ్డ వారికి 10 లక్షల చొప్పన సాయం**
**ప్రమాదఘటన జరగ్గానే కేంద్ర మంత్రుల రాక**
**మంత్రి లోకేశ్ వెల్లడి**

**విశాఖపట్నం, జూన్9(జై భీమ్ న్యూస్) :**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.25 లక్షల పరిహారం అందజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. గాయపడినవారికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని తెలిపారు. మంగళవారం విశాఖపట్నంలో మంత్రి లోకేశ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌లో నిన్న జరిగిన ఘటన చాలా బాధాకరమని అన్నారు. 4.15 నిమిషాలకు ఈ ప్రమాదం జరిగిందని తెలియగానే కేంద్రమంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు ఇక్కడికి వచ్చారని తెలిపారు. ఈ ఘటనలో 9 మంది చనిపోయారని... 6 మంది గాయపడ్డారని చెప్పారు. తాము పరిహారం ఇవ్వడానికి ఇక్కడకు రాలేదని... శాశ్వతంగా బాధితులకు అండగా ఉంటామని లోకేశ్ భరోసా కల్పించారు. బాధిత కుటుంబాలతో సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్మికులకు పూర్తిగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. తమకు ఉన్న చిత్తశుద్ధితో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. తమకు వాట్సాప్ గ్రూప్ ఒకటి ఉందని.. రాష్ట్రంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా తాము తక్షణమే అక్కడకు వెళ్తామని.. అందులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఉన్నారని ప్రస్తావించారు. ఉక్కు కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మాటిచ్చారు. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు'తో స్టీల్ ఎ÷-లాంట్‌ని సాధించుకున్నామని వ్యాఖ్యానించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో స్టీల్ ప్లాంట్ ఏర్పడిందని ప్రస్తావించారు. ఈ ఘటనపై కార్మిక సంఘాల నేతలు కావాలని అపోహలు సృష్టించొద్దని అన్నారు. 24 గంటలు గడవక ముందే ఇలా మాట్లాడటం భావ్యం కాదని చెప్పారు. విశాఖ ఉక్కును కాపాడాలని కార్మికులు తమను కోరుతున్నారని అన్నారు. విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఉత్తరాంధ్రలో పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయని వివరించారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో విశాఖ స్టీల్‌కు సంక్షోభం వస్తే.. ఆనాడు మనం కాపాడుకున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లోకేశ్ చురకలు అంటించారు. 'ఇంత భారీ ప్రమాదం జరిగితే ఇక్కడకు ప్రతిపక్ష టీమ్ లెవెన్ నుంచి కెప్టెన్ వచ్చారా..?. టీం లెవెన్ కెప్టెన్‌కు సమాధానం చెప్పాల్సిన అవసరం మాకు లేదు. మాకు 124 స్థానాలు ఇచ్చిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మాకు ఉంది. పరదాలు కట్టుకొని వెళ్లే వారికి కాదు' అని లోకేశ్ సెటైర్లు గుప్పించారు.

# దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికుల దుర్మరణం**

**హైదరాబాద్,జూన్9(జై భీమ్ న్యూస్) :**

దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మినీ బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులతో పాటు మరో నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే..దుబాయ్‌లోని అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రోడ్డుపై సోమవారం వేగంగా వస్తున్న మినీబస్సు ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. మృతులను జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలానికి చెందిన అబ్దుల్ రఫీక్, కొడిమ్యాల మండలానికి చెందిన సయ్యద్ సలీం, మల్యాల మండలానికి చెందిన గజుల తిరుపతిగా గుర్తించారు. గాయపడిన వారిలో హైదరాబాద్ నగరానికి చెందిన మహమ్మద్ సయాద్ కూడా ఉన్నాడు. వీరందరూ షార్జా కేంద్రంగా పని చేస్తున్న అల్యూమినియం గ్లాస్, డోర్ ఫ్రేమ్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న భారత కాన్సులేట్ అధికారులు బాధితులను పరామర్శించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు మంత్రి పరామర్శ

**అండగా ఉంటామని వాసంశెట్టి హామీ**

**విశాఖపట్నం,జూన్9(జై భీమ్ న్యూస్) :**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనలో గాయపడిన వారిని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ పరామర్శించారు. మంగళవారం)ఉదయం షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులను మంత్రి పరామర్శించి.. వారి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘటన దురదృష్టకరమైనదన్నారు. ఈ ఘటనలో గాయపడిన వారిలో ముగ్గురు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని పరామర్శించానని.. మెరుగైన వైద్య చికిత్స అందుతోందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు... గాయపడిన వారికి పది లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు చెప్పారు. కార్మిక సంఘాల నేతలు చేస్తున్న ఆరోపణలో నిజం లేదని స్పష్టం చేశారు. ప్రమాద ఘటన జరిగినప్పుడు కార్మికులు అవసరమైన సంఖ్యలోనే ఉన్నారని వెల్లడించారు. స్టీల్ ఎ÷-లాంట్‌లో క్రమం తప్పకుండా తనిఖీలు జరిగాయన్నారు. బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి వాసంశెట్టి సుభాశ్ పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

**మీడియా సమావేశంలో బిజెపి అధ్యక్షుడు**

**భువనగిరి,జూన్9(జై భీమ్ న్యూస్) :**

తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ ఇస్తుందని స్పష్టంచేశారు. దేశవ్యాప్త ధాన్యం సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రాంచందర్ రావు ఆరోపించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా సామాన్యుడి ఆయుధంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

# హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షం

## అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్,జూన్9(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా ఏర్పడిన పరిస్థితులపై హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ కమిషనర్, సిటీ పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తక్కువ సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో మోకాళ్ల లోతు వరకు వర్షపు నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గరంలోని ఒక్కసారిగా ఈదురు గాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపడిన ఘటనలపై మంత్రి ఆరా తీశారు. విద్యుత్ షాక్ తో ఇద్దరు వ్యక్తులు మరణించారని తెలుసుకున్న సమాచారంతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కూలిన చెట్లు ,తెగిన విద్యుత్ తీగలు తొలగించడానికి సహాయక చర్యలను వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్, విద్యుత్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఈ ఏడాదే పాలేరుకు గోదావరి జలాలు

## రాష్ట్రంలో కోటీ యాభై లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం,జూన్9(జై భీమ్ న్యూస్) :**

ఈ ఏడాదిలోనే పాలేరుకు గోదావరి జలాలు వస్తాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. రైతులను బాధపెట్టే వారే రేవంత్‌రెడ్డిని విమర్శిస్తున్నారని అన్నారు. తెలంగాణలో కోటీ యాభై లక్షల టన్నుల ధాన్యం పండించారని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు 75 లక్షల టన్నుల మెట్రిక్ ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. మంగళవారం నేలకొండపల్లి మండలం చెరువు మాదారంలో డీసీసీబీ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల హాజరై మాట్లాడారు. అన్ని వ్యవసాయ పంటలు పండించే నియోజకవర్గం పాలేరు అని అభివర్ణించారు. నేడు పాలేరు ధనిక నియోజకవర్గమని ఉద్ఘాటించారు. నాగార్జునసాగర్ జలాలతో పాటు, భక్తరామదాసు, గోదావరి జలాలతో నియోజకవర్గం పునీతమవుతోందని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. ఈ పనుల కోసం రూ.4,900 కోట్లు కేటాయించామని వెల్లడించారు.రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశామని స్పష్టం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రంలో ఎక్కడా రుణమాఫీ చేయలేదని.. అప్పులు చాలా ఉంటాయని అన్నారు. తమ ప్రభుత్వం పంటరుణాల వరకు రుణమాఫీ చేసిందని ప్రస్తావించారు. ఖజానాపై భారం ఉన్నప్పటికీ రూ.27 వేల కోట్లు రైతు భరోసా ఇచ్చామని స్పష్టం చేశారు. పక్క రాష్ట్రంలో మొక్కజొన్న కొనటం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. పక్క రాష్ట్రాల రైతులు ఇక్కడ రైతుల పేరు మీద అమ్ముకుంటున్నారని చెప్పుకొచ్చారు. పనిచేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వాదిస్తే ప్రజల బతుకులు బాగుంటాయని తెలిపారు. డీజిల్, యూరియా ఇచ్చేది కేంద్రప్రభుత్వమేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులు చేయదన్నారు. రైతులు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను నమ్మే పరిస్థితి లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# గచ్చిబౌలిలోని హిల్ రిడ్జ్ విల్లాలో దోపిడి కేసు

## 24 గంటల్లో ఛేదించామన్న శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్

**హైదరాబాద్,జూన్9(జై భీమ్ న్యూస్) :**

గచ్చిబౌలిలోని హిల్ రిడ్జ్ విల్లాలో దోపిడి కేసును 24 గంటల్లో ఛేదించామని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ దోపిడికి పాల్పడిన ఇద్దరు నేపాలీ దొంగలను ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి 7 కిలోల బంగారంతోపాటు కిలోన్నర వెండి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ దోపిడి జరిగిన వెంటనే ఫిర్యాదు అందడంతో.. ఆరు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. నిందితులకంటే ముందే భారత్, నేపాల్ సరిహద్దుల్లోకి ఆయా బృందాలు చేరుకున్నాయని వివరించారు. తద్వారా నిందితులను అరెస్ట్ చేయడం సులువైందన్నారు. బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని న్యాయస్థానంలో నిందితులను హాజరు పరిచి అనంతరం హైదరాబాద్‌కు తీసుకోస్తామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఇంట్లో నేపాలీ పని మనుషులను పెట్టుకొనేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు డీసీపీ సూచించారు. హిల్ రిడ్జ్ విల్లాలో ఇంటి ఓనర్లు బయటకు వెళ్లే సమయంలో లాకర్ కీ దాచే ప్రదేశాన్ని నేపాలీ పని మనిషి దంపతులు ముందుగా గుర్తించారని తెలిపారు. ఇలా ఇంట్లో యజమానులు లేని సమయంలో ఈ దంపతులు లాకర్ ఓపెన్ చేసి బంగారం, వెండి చోరీ చేశారని వివరించారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సైబరాబాద్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టి దోపిడి దొంగలను అరెస్ట్ చేశారని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ వివరించారు.

# మొహర్రం ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు

## మొహర్రం ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష

## రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,జూన్9(జై భీమ్ న్యూస్) :**

ఈనెల 16న జరగనున్న మొహర్రం ఉరేగింపు కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రాష్ట్ర రవాణా, బి.సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తో కలిసి వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్, రోడ్లు మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు తాగు నీటి సరఫరా చేయాలని, జి.హెచ్.ఎం.సి అధికారులు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్ అండ్ బి అధికారులు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీ-కా-ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్ లను కూడా అందుబాటులో ఉంచాలని అన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఫహీం కురేషీ, చార్మినార్, బహదూర్‌పురా, యాకత్ పురా, నాంపల్లి, కార్వాన్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు, మీర్ జుల్ఫెకర్ అలీ, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మీర్జా రహ్మత్ బేగ్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్, మైనారిటీ ÷నాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్(ఊఓచాః) ఎండీ అశోక్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, వక్ఫ్ బోర్డు అఇక్ష తదితరులు పాల్గొన్నారు.



# పచ్చిరొట్ట పంటల సాగుతో భూమి సారవంతం

## వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి సూచన

హైదరాబాద్,జూన్9(జై భీమ్ న్యూస్) : వ్యవసాయ భూముల్లో సేంద్రియ కర్బన పదార్థం తగ్గిపోవడం, నేల గట్టిపడటం, నీటి నిల్వ సామర్థ్యం క్షీణించడం, రసాయన ఎరువుల వినియోగం పెరగడం వంటి సమస్యలను అధిగమించేందుకు రైతులు పచ్చిరొట్ట పంటల సాగును విస్తృతంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి సూచించారు. జనుము, జీలుగు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పంటలను ప్రధాన పంటలకు ముందు లేదా రెండు పంటల మధ్యకాలంలో సాగు చేసి, పూత దశలో భూమిలో కలియదున్నడం ద్వారా నేలలో సేంద్రియ కర్బన పదార్థం పెరిగి భూమి సారవంతమవుతుందని తెలిపారు. ఈ పంటలను భూమిలో కలపడం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఉపయోగకరమైన సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల వేర్ల వద్ద అభివృద్ధి చెందే సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని భూమిలో స్థిరపరచి మొక్కలకు సహజ పోషకాలను అందిస్తాయని తెలిపారు. దీంతో రసాయన ఎరువుల అవసరం తగ్గి సాగు ఖర్చులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. మామిడి, జామ, నిమ్మ, కొబ్బరి, ఆయిల్ పామ్ వంటి పండ్ల తోటల మధ్య పచ్చిరొట్ట పంటలను సాగు చేసి వాటిని కలియదున్నడం లేదా చెట్ల చుట్టూ పరిచి ఉంచడం ద్వారా సహజసిద్ధమైన మల్చింగ్ ఏర్పడుతుందని తెలిపారు. దీనివల్ల భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో పాటు కలుపు మొక్కల పెరుగుదల తగ్గి వేర్ల అభివృద్ధి మెరుగుపడుతుందని చెప్పారు. చ్చిరొట్ట పంటలను పూత దశకు ముందే భూమిలో కలియదున్నడం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడి సుస్థిర వ్యవసాయానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

# భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగానే అడుగులు...

## స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం

## పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు

## 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవంలో

## మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జూన్9(జై భీమ్ న్యూస్) :**

భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్-టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్-టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో... భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి అనేది కేవలం భూమి, మూలధనంపైనే కాకుండా... మేధో సంపత్తి, నాలెడ్జ్ ఎకానమీ ఆధారంగానే సాధ్యమవుతుందన్నారు. అందుకు... పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల శిక్షణకు మధ్య ఉన్న స్కిల్ గ్యాప్ ను పూడ్చాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను స్కిల్ క్యాపిటల్ గా మార్చాలనే సంకల్పంతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను తీసుకొచ్చి... ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతోనే ముందుకెళ్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధిని కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలను మరింత ప్రోత్సహించేందుకు దేశంలోనే తొలిసారిగా ప్రత్యేక 'ఎంఎస్ఎంఈ పాలసీ'ని తీసుకొచ్చామన్నారు. పారిశ్రామికవేత్తలకు 2017 నుంచి చెల్లించాల్సిన పెండింగ్ సబ్సిడీలను దశలవారీగా చెల్లిస్తున్నామన్నారు. అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకునే కనీస వేతనాలను నిర్ణయించామన్నారు. పారిశ్రామికవేత్తలను మేం కేవలం పెట్టుబడిదారులుగా మాత్రమే చూడటం లేదని... రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములుగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి పారిశ్రామికవేత్తలిచ్చే సలహాలు, సూచనలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ టీసీసీఐ ప్రతినిధులు రవి కుమార్, కేకే మహేశ్వరీ, శ్రీనివాస్ గరిమెల్లా, భాస్కర్ రెడ్డి, అనిల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవ గీతానికి చిరస్మరణీయ నివాళి

## ఘట్కేసర్‌లో 'అందెశ్రీ స్మృతి వనం' ఏర్పాటు

## స్మృతి వనం పనులను పరిశీలించిన మంత్రి అడ్లూరి

**హైదరాబాద్,జూన్9(జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని తన కలంతో ప్రజల్లో రగిలించిన మహాకవి, ప్రజా గాయకుడు, రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్ పక్కన ఏర్పాటు చేయనున్న 'అందెశ్రీ స్మృతి వనం' స్థలాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ చరిత్రలో అందెశ్రీది ప్రత్యేక స్థానం అని పేర్కొన్నారు. తన గీతాలు, రచనల ద్వారా తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు అందెశ్రీ సేవలకు గుర్తింపుగా ఈ స్మృతి వనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఘట్కేసర్‌లో ప్రభుత్వం ఎకరం 22 గుంటల భూమిని ఇందుకోసం కేటాయించిందని మంత్రి వెల్లడించారు. ఇది కేవలం ఒక ఉద్యానవనం మాత్రమే కాకుండా, తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే స్మారక క్షేత్రంగా రూపుదిద్దుకోనుందని చెప్పారు. అందెశ్రీ జీవిత విశేషాలు, ఉద్యమంలో ఆయన పాత్ర, సాహిత్య సేవలను భావితరాలకు చేరవేసే విధంగా స్మృతి వనాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రను, ఉద్యమ స్ఫూర్తిని యువతకు పరిచయం చేసే జ్ఞాపక చిహ్నంగా ఈ ప్రాంగణం నిలవాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ... స్మృతి వనం అభివృద్ధి కోసం ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే టెండర్ల పక్రియ ప్రారంభించి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం స్మృతి వనాన్ని నిర్వహణ కోసం హెచ్ఎండీఏకు అప్పగించనున్నట్లు చెప్పారు. స్మృతి వనంలో అందెశ్రీ విగ్రహం, ఆయన జీవిత చరిత్రను ప్రతిబింబించే శిలాఫలకాలు, తెలంగాణ ఉద్యమ గీతాల ప్రదర్శన గ్యాలరీ, సాహిత్య వేదిక, పచ్చదనంతో కూడిన ప్రత్యేక ఉద్యానవనం, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని గీతంగా మలిచిన మహాకవి అందెశ్రీకి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ గౌరవం, తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది.

# దేవాలయాల్లో చేనేత శాలువాలే అందించాలి

## మంత్రి కొండా సురేఖకు గజం అంజయ్య వినతిపత్రం

## సానుకూలంగా స్పందించిన మంత్రి కొండా సురేఖ

## ఆలయాల్లో చేనేత వస్త్రాల వినియోగం పరిశీలిస్తామని హామీ

**హైదరాబాద్,జూన్9(జై భీమ్ న్యూస్) :**

రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు ఆశీర్వచనంగా చేనేత రంగం ద్వారా తయారు చేసిన శాలువాలను మాత్రమే అందించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ చేనేత కళాకారుడు గజం అంజయ్య దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి కొండా సురేఖను కోరారు. ఈ మేరకు మంత్రి కొండా సురేఖను జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా చేనేతకారులు స్వచ్ఛమైన నూలుతో తయారైన శాలువాతో మంత్రిని సత్కరించారు. యాదాద్రి, భద్రాచలం, బాసర, వేములవాడ తదితర ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సేవల్లో పాల్గొనే భక్తులకు అందించే శాలువాలు ప్రస్తుతం పెద్దమొత్తంలో మరమగ్గాలు, మిల్లుల్లో కృత్రిమ నూలుతో తయారవుతున్నాయని ఆయన మంత్రి సురేఖకి వివరించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా దేవాలయాల్లో ఎ÷-లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధిస్తున్న పరిస్థితుల్లో సింథటిక్ నూలుతో తయారైన శాలువాల వినియోగాన్ని కొనసాగించడం సముచితం కాదని తన అభిప్రాయాన్ని మంత్రి సురేఖ కి విన్నవించారు. ఈ కార్యక్రమంలో చేనేత రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. విత్రమైన దేవాలయాల్లో భక్తులకు అందించే శాలువాలు స్వచ్ఛమైన పత్తి లేదా పట్టు చేనేత వస్త్రాలతో తయారైతే వాటికి మరింత ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువ చేకూరుతుందని అంజయ్య మంత్రి సురేఖ గారికి తెలిపారు. అదే సమయంలో ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది మంది చేనేత కార్మికులకు స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు తెలంగాణ చేనేత సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని వివరించారు.


# కందిపప్పు ఎక్కువగా తింటున్నారా..?



మన రోజువారీ ఆహారంలో కందిపప్పు ముఖ్యమైన భాగం. కానీ ఇటీవల కల్తీ సమస్య పెరుగుతోంది. కేసరి పప్పు అనే విషపూరిత పదార్థాన్ని దీనిలో కలుపుతున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది అంటున్నారు. మన ఆహారంలో ప్రోటీన్ ప్రధానమైన మూలకం. దానిని అందించేవాటిలో పప్పులు ముఖ్యమైనవి. అందులోను కందిపప్పు మన భారతీయ ఆహారంలో ప్రత్యేకమైన స్థానం కలిగి ఉంది. ముఖ్యంగా సాంబార్, పప్పు కూరలు తయారీలో కందిపప్పును విరివిగా ఉపయోగిస్తారు. కానీ ప్రస్తుతం దీనిలో కల్తీ ఎక్కువవుతోందనే సమాచారం ఆందోళన కలిగిస్తోంది. కేసరి పప్పు అనే రసాయనాలతో కలిపిన విషపూరిత పప్పును కల్తీ చేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ఆరోగ్యానికి హానికరమని, దీని వల్ల తీవ్రమైన నరాల సమస్యలు, క్యాన్సర్ వంటి జబ్బులు వస్తాయని సూచిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన పరిశోధనల్లో మార్కెట్లో లభిస్తున్న కందిపప్పులో కేసరి పప్పును కలుపుతున్నట్లు గుర్తించారు. ఈ కేసరి పప్పు అసలు తినదగినది కాదు. ఇది కలుపు మొక్కల ద్వారా పెరిగే విషపూరిత పదార్థం. దీన్ని తినడం వల్ల ముఖ్యంగా నరాల వ్యవస్థ దెబ్బతింటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీన్ని ఎక్కువగా తింటే కాళ్లు, చేతులు నెమ్మదిగా పని చేయకపోవడం, నడవలేకపోవడం లాంటి సమస్యలు వస్తాయి. దీన్ని లాథిరిజం అని అంటారు. దీని ప్రభావం శాశ్వతంగా ఉండే ప్రమాదం ఉంది. అంతేకాకుండా వ్యాపారులు ఈ కల్తీని గుర్తించకుండా ఉండేందుకు టార్ట్రాజిన్ అనే రసాయనాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది ఒక రకమైన ఆహార రంగు పదార్థం. దీని వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. దీన్ని ఎక్కువగా తీసుకుంటే శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. దీని ప్రభావం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. కేసరి పప్పు కందిపప్పును పోలి ఉంటుంది. అయితే దీని ఆకారం కొద్దిగా చతురస్రాకారంలో ఉంటుంది. కొంతమంది వ్యాపారులు తక్కువ ధరలో లభించే ఈ పప్పును అసలు కందిపప్పులో కలిపి అమ్ముతున్నారు. దీని వల్ల సామాన్య వినియోగదారులకు అసలు పప్పు, కల్తీ పప్పు మధ్య తేడా గుర్తించడం కష్టం అవుతోంది. ఇంట్లోనే ఈ పప్పులో కల్తీ ఉందో లేదో సులభంగా పరీక్షించుకోవచ్చు. దాని కోసం 10 గ్రాముల పప్పులో 25 మి.లీ నీరు పోసి, 5 మి.లీ హైడ్రోక్లోరిక్ ఆమ్లం వేసి చిన్న మంటపై వేడి చేయాలి. ఈ ప్రక్రియలో నీటి రంగు మారితే ఆ పప్పులో కల్తీ ఉందని అర్థం. అదనంగా సహజమైన కందిపప్పు నునుపుగా, గుండ్రంగా ఉంటుంది. అయితే కల్తీ కేసరి పప్పు త్రికోణాకారంలో ఉండే అవకాశం ఉంది. ప్రతిరోజు మనం తినే ఆహార పదార్థాలు మానవ ఆరోగ్యానికి ముప్పు కలిగించకూడదు. కాబట్టి నాణ్యమైన పప్పును మాత్రమే కొనుగోలు చేయాలి. గుర్తింపు పొందిన బ్రాండ్‌లను ఉపయోగించడం ఉత్తమం. మార్కెట్లో తక్కువ ధరకు లభించే నాణ్యత లేని పప్పులను కొనడం మానుకోవాలి.

# పుచ్చకాయలోని తెల్లని భాగం పొరబాటున ఎప్పుడైనా తినేశారా?

చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. వేసవిలో ప్రకృతి ప్రసాధించిన అద్భుత వరం పుచ్చకాయ. పండ్ల రారాజు మామిడి, లిచీ, పుచ్చకాయ వంటి అన్ని రకాల పండ్లు ఈ కాలంలో అధికంగా వస్తాయి. ముఖ్యంగా వేసవి వేడి నుంచి ఉపశమనం కలిగించడంలో పుచ్చకాయకు మించిన ప్రత్యామ్నయం మరొకటి లేదు. అయితే మనలో చాలా మందికి పుచ్చకాయలోని ఎర్రటి భాగాన్ని తినడం అలవాటు. మిగిలిన ఆకుపచ్చ తొక్కను, దానికి అంటుకున్న తెల్లటి భాగాన్ని పారేస్తుంటాం. అయితే వైద్యులు పూర్తిగా భిన్నమైన విషయం ఒకటి చెబుతున్నారు. అందేంటంటే.. పుచ్చకాయలోని తెల్లని భాగాన్ని తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయట. ఇందులో సిట్రుల్లైన్ అనే ఒక రకమైన అనావశ్యక అమైనో ఆమ్లం ఉంటుంది. పుచ్చకాయలోని తెల్లని భాగం తినడం వల్ల శరీరంలో దీని స్థాయి పెరుగుతుంది. సిట్రులిన్ మన రక్త నాళాలను విస్తరిస్తుంది. యుఎస్ నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పరిశోధన ప్రకారం సిట్రుల్లైన్ కండరాలకు ఆక్సిజన్ అందిస్తుంది. ఫలితంగా పనితీరు పెరుగుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ హైపర్‌టెన్షన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. పుచ్చకాయలోని తెలుపు, ఇతర భాగాలు పెద్దలలో అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. పుచ్చకాయ తొక్కలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు అనేక ప్రయోజనాలను కలిగి ఉంటాయనే సంగతి తెలిసిన విషయమే. ఫైబర్ ప్రేగు కదలికలకు సహాయపడుతుంది. పెద్దప్రేగు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు త్వరగా కడుపు నింపుతాయి. ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తాయి. బరువును నియంత్రించడంలో సహాయపడతాయి.



# డయబెటిస్‌తో బాధపడుతున్నారా?




డయాబెటిస్ రోగులు కొన్నిసార్లు శరీరంలో వాపు సమస్యను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఉల్లిపాయలు తినడం లాభదాయకం. ఈ రోజుల్లో హై బ్లడ్ షుగర్ లేదా డయాబెటిస్ సమస్య చాలా మంది వ్యక్తులలో సాధారణంగా కనిపిస్తోంది. ఈ వ్యాధికి పూర్తి స్థాయి నివారణ లేనప్పటికీ దీనిని నియంత్రణలో ఉంచడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడానికి ప్రజలు అనేక రకాల ఇంటి చిట్కాలను పాటిస్తారు. మందులను ఉపయోగిస్తారు. అయితే, ఉల్లిపాయలు తినడం కూడా డయాబెటిస్ రోగులకు చాలా మేలు చేస్తుందని తెలుసుకోవడం ఆసక్తికరం. ఉల్లిపాయల్లో ఫోలేట్, విటమిన్ సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఉల్లిపాయలను వంటలో వేసుకుని తినవచ్చు. కానీ పచ్చి ఉల్లిపాయలు తినడం ఇంకా ఎక్కువ ప్రయోజనకరం. ఉల్లిపాయల్లో ఉండే క్వెర్సెటిన్ అనే యాంటీఆక్సిడెంట్ గుణం రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. దీనిని తినడం వల్ల శరీరం గ్లూకోజ్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రణలో ఉంచవచ్చు. ఉల్లిపాయల గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉన్న ఆహార పదార్థాలు డయాబెటిస్ రోగులకు ఎంతో మంచివి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా పెంచవు. అందుకే పచ్చి ఉల్లిపాయలను నిరభ్యంతరంగా తినవచ్చు. డయాబెటిస్ రోగులు కొన్నిసార్లు శరీరంలో వాపు సమస్యను ఎదుర్కొంటారు. అలాంటి సమయంలో ఉల్లిపాయలు తినడం లాభదాయకం. ఉల్లిపాయల్లోని సల్ఫర్ సమ్మేళనాలు, యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో, బరువు తగ్గడంలో కూడా ఉల్లిపాయలు ఉపయోగపడతాయి. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. డయాబెటిస్ రోగులకు బరువును నియంత్రణలో ఉంచడం చాలా ముఖ్యం. ఉల్లిపాయలను కూరల్లో కలిపి తినవచ్చు లేదా సలాడ్‌గా కూడా సేవించవచ్చు. డయాబెటిస్ రోగులకు ఉల్లిపాయలు ఒక సహజమైన, సులభమైన ఆహార ఎంపిక. దీనిని రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంతో పాటు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. అయితే ఏదైనా కొత్త ఆహారాన్ని డైట్‌లో చేర్చే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. ముఖ్యంగా డయాబెటిస్‌తో ఇబ్బంది పడేవారు వైద్యులను సంప్రదించాలి.

## ఈ పండ్లు తింటే జీవితంలో గుండె జబ్బులు రావ్..



నేటి కాలంలో ఆరోగ్యంగా ఉండటం పెను సవాలే. మారిన జీవన శైలి, అనారోగ్యకరమైన ఆహారం ఆరోగ్య సమస్యలను పెంచుతున్నాయి. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరినీ హడలెత్తిస్తున్న ప్రధాన సమస్య గుండె సమస్యలు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ దీని బారీన పడుతున్నారు. నేటి కాలంలో గుండె జబ్బులు పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరినీ ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పటికే ఎంతో మంది యువకులు, చిన్న పిల్లలు గుండెపోటుతో మృతి చెందారు. దీనికంతటికీ కారణం మనం తినే ఆహారాలు, మన తప్పుడు దిన చర్యలే కారణం అంటున్నారు నిపుణులు. అందువల్ల, గుండె జబ్బులను ఎలా నివారించాలో నిపుణులు కొన్ని సలహాలు ఇస్తున్నారు. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం చాలా అవసరం. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి దోహదం చేసే 5 రకాల పండ్లు ఇవే. బ్లూబెర్రీస్‌లో ఆంథోసైనిన్లు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు. ఇవి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. రక్తపోటును తగ్గిస్తుంది. యాపిల్స్ ఫైబర్ కు మంచి మూలం. గుండెకు మేలు చేసే ఆమ్లాలు ఇందులో అధికంగా ఉంటాయి. పెక్టిన్ కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను సక్రమంగా ఉంచుతుంది. ప్రతిరోజూ ఒక ఆపిల్ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. దానిమ్మ గుండె ఆరోగ్యానికి మేలు చేసే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లను అందిస్తుంది. దీన్ని తినడం రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. గుండె సామర్థ్యం పెరుగుతుంది. రక్తపోటు, పిత్త సమతుల్యతను కాపాడుకోవడం సాధ్యమవుతుంది. అవకాడోలు గుండెకు ఆరోగ్యకరమైన మోనోశాచురేటెడ్ కొవ్వులతో నిండి ఉంటాయి. ఇందులో పొటాషియం, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇందులో ఫోలేట్ అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. అవకాడో జీర్ణక్రియ, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నారింజలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది.

## ఈ సమస్యలు ఉన్నవారు ఖర్జూర పండ్లు తినకూడదు..!



ఆరోగ్య నిపుణుల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లయితే అలాంటి పరిస్థితిలో ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోకుండా ఖర్జూరాన్ని మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. ఖర్జూరం తినడం వల్ల ఆరోగ్యానికి సంబంధించిన అనేక తీవ్రమైన సమస్యలు తొలగిపోతాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో ఖర్జూరాన్ని చేర్చుకోవాలని సలహా ఇస్తారు. నిపుణుల ప్రకారం.. సరైన మోతాదులో సరైన విధానంలో ఈ డ్రై ఫ్రూట్‌ను ఆహార ప్రణాళికలో చేర్చుకుంటే మొత్తం ఆరోగ్యం చాలా వరకు మెరుగుపడుతుంది. అయితే, ఖర్జూరం తినడం వల్ల కొందరి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం కూడా పడవచ్చు. అందువల్ల కొన్ని సందర్భాల్లో ఈ వారు ఖర్జూరాన్ని ఆహారంలో తీసుకోకుండా ఉండాలి. ఆరోగ్య నిపుణుల ప్రకారం కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లయితే అలాంటి పరిస్థితిలో ఆరోగ్య నిపుణుల సలహా తీసుకోకుండా ఖర్జూరాన్ని మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. అలాగే, అధిక మోతాదులో ఖర్జూరం తీసుకోవడం వల్ల మీ బరువు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి ఊబకాయం నుండి విముక్తి పొందాలనుకుంటే ఖర్జూరం తినడం మానుకోవడం మంచిది. డయేరియా సమస్యతో బాధపడుతున్న రోగులు కూడా ఈ డ్రై ఫ్రూట్‌ను తినకుండా ఉండాలి. ఖర్జూరంలో ఉండే కొన్ని పదార్థాలు డయేరియా సమస్యను మరింత పెంచే పని చేస్తాయి. అంతేకాకుండా అధిక మోతాదులో ఖర్జూరం తినడం వల్ల మలబద్ధకం సమస్య కూడా పెరగవచ్చు. గర్భం దాల్చిన సమయంలో ఆహారం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. ఇలాంటి పరిస్థితిలో గర్భిణీ స్త్రీలు కూడా ఎక్కువగా ఖర్జూరం తినకూడదు. వైద్యుడి సలహా లేకుండా ఈ డ్రై ఫ్రూట్‌ను తినకపోవడమే మంచిది. అంతేకాకుండా ఖర్జూరం తినడం వల్ల అలర్జీ ఉంటే ఈ డ్రై ఫ్రూట్‌ను మీ ఆహార ప్రణాళికలో భాగం చేయకూడదు. ఖర్జూరం తినడం వల్ల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే కొన్ని పరిస్థితుల్లో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉంది. దీన్ని సమతుల్యంగా తీసుకుంటే శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఖర్జూరం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరంగా చూద్దాం!

## రాత్రి భోజనంలో అన్నం తింటున్నారా?



దాదాపు ప్రతి ఇంటిలోనూ అన్నం ప్రధాన ఆహారం. చాలా మంది మధ్యాహ్నం, రాత్రి భోజనానికి అన్నం తినడానికి ఇష్టపడతారు. కానీ రాత్రిపూట అన్నం తినడం ఆరోగ్యానికి మంచిదా? అనే సందేహం పలువురికి ఉంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బియ్యం మన శరీరానికి శక్తిని, అవసరమైన పోషకాలను అందిస్తున్నప్పటికీ రాత్రిపూట ఆలస్యంగా తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. బియ్యంలో సాధారణంగా కార్బోహైడ్రేట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇది శరీరానికి శక్తిని ఇస్తుంది. అయితే రాత్రిపూట మన శారీరక శ్రమ చాలా తక్కువగా ఉంటుంది కాబట్టి, కార్బోహైడ్రేట్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు పేరుకుపోతాయి. అంతేకాకుండా నిద్రలో శరీర జీవక్రియ నెమ్మదిస్తుంది. దీనివల్ల అదనపు కేలరీలను బర్న్ చేయడం కష్టమవుతుంది. ఇది కాలక్రమేణా బరువు పెరగడానికి దారితీస్తుంది. తెల్ల బియ్యం అధిక గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటాయి. దీని అర్థం ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ముఖ్యంగా మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి రాత్రి భోజనంలో అన్నం తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. కాలక్రమేణా ఇది టైప్ 2 డయాబెటిస్, ఇతర జీవక్రియ రుగ్మతల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, మంచి ఆహారాన్ని ఎంచుకోవడం రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి మంచి మార్గం. చాలా మందికి రాత్రి భోజనంలో అన్నం తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, జీర్ణ సమస్యలు ఎదురవుతాయి. అంతేకాకుండా బియ్యంలోని కార్బోహైడ్రేట్లు జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో జీర్ణక్రియ సరిగా లేని వారికి, రాత్రి భోజనానికి అన్నం తినడం వల్ల ఆమ్లత్వం, ఆపాన వాయువు ఏర్పడతాయి. ఇది మీ నిద్రను గణనీయంగా ప్రభావితం చేస్తుంది. బియ్యంలో నిద్రను ప్రోత్సహించే ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉండటం వల్ల ఇది శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. రాత్రిపూట క్రమం తప్పకుండా అన్నం తినడం వల్ల పొట్ట దగ్గర కొవ్వు పెరుగుతుంది. తెల్ల బియ్యంలో శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇందులో ఫైబర్ తక్కువగా ఉంటుంది. దీనిని అధికంగా తీసుకోవడం వల్ల బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోతుంది. బియ్యం బదులుగా ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవచ్చు. రాత్రిపూట రోటీ లేదా చపాతీ, రాగి, కూరగాయల సూప్ వంటి ఆహారాలు తినడానికి ప్రయత్నించాలి.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# వివాదాస్పద సన్నివేశాలు తొలగించాం

**పెద్ది డైరెక్టర్ బుచ్చిబాబు వెల్లడి**

'పెద్ది'లో వివాదాస్పదమైన సన్నివేశాలను తొలగించినట్లు దర్శకుడు బుచ్చిబాబు వెల్లడించారు. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ ఇందులోని కొన్ని సన్నివేశాలపై సోషల్ మీడియాలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటీవల క్షమాపణలు చెప్పిన బుచ్చిబాబు ఆయా సన్నివేశాలను తొలగిస్తామని చెప్పారు. వాటిని తొలగించినట్లు తాజాగా తెలిపారు. ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీనిపై వివరణ ఇచ్చారు. 'చాలా మంది ఇలాంటి మంచి కథలో జాన్వీ కపూర్ ట్రాక్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారు. సినిమాకు ఆ పాత్ర అనవసరమని కామెంట్ చేశారు. నా గత సినిమాతో (ఉప్పెన) పోలిస్తే 'పెద్ది' కథను నేను పూర్తి భిన్నంగా రాసుకున్నా. కొండల ప్రాంతంలో మారుమూల గ్రామం నుంచి వచ్చిన వ్యక్తి పెద్ది. మొదట అతడిలో మొరటుతనాన్ని చూపించి.. సినిమా చివరిలో దాన్ని సరిదిద్దాలని భావించాను. అతడు పెరిగిన వాతావరణం వల్ల అలా ఉన్నాడని.. అతడు మారడానికి అమ్మాయి ప్రేమ కూడా ఓ కారణం కావాలని ఆమె పాత్రను రాశాను. అయితే, స్క్రీన్‌ప్లేలో కొన్ని సన్నివేశాలు అపార్థానికి దారితీశాయి. దీంతో అందరూ ఆ పాత్రను తప్పుగా అర్థం చేసుకున్నారు. విడుదల అనంతరం వచ్చిన విమర్శలను మేం పరిగణనలోకి తీసుకున్నాం. ఆ సన్నివేశాలను గుర్తించి సినిమా నుంచి తొలగించాం అని బుచ్చిబాబు వివరించారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పించారు. ఆయనకు జోడీగా జాన్వీకపూర్ అచ్చియమ్మ పాత్రలో కనిపించారు. ఆమె పాత్రను గ్లామర్‌కే పరిమితం చేశారని పరిచయ సన్నివేశాల్లోనూ ఆమెను చూపిన విధానంపై విమర్శలు వచ్చాయి. ఈ వివాదం పక్కన పెడితే జూన్ 4న విడుదలైన ఈ చిత్రం ఇప్పటి వరకూ రూ.315 కోట్లు రాబట్టింది. అయితే, ఈ సినిమాలో జాన్వీ కపూర్ సీన్స్ తో పాటు సెకండాఫ్ లో కొన్ని పాత్రల ఎండింగ్ సరిగా లేదని కొద్దీ రోజులుగా విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రేక్షకుల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా చిత్ర బృందం ఈ సినిమాలో కొన్ని కీలక మార్పులు చేయబోతున్నారు. తాజా సమాచారం ప్రకారం.. 'పెద్ది' సినిమా లెంత్, అలాగే కొన్ని సీన్స్ విషయంలో వస్తున్న మిశ్రమ స్పందనను దృష్టిలో ఉంచుకుని మేకర్స్ కొన్ని సీన్లను డిలీట్ చేసి, మరికొన్ని కొత్త సీన్లను జత చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా సెకండాఫ్ లో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ పోషించిన 'గౌరినాయుడు' ఎ÷–లాష్‌బ్యాక్ సీన్స్‌ను కొన్నింటిని తొలగించనున్నారట. ఈ సీన్స్ సినిమా ఎ÷–లోను కాస్త నెమ్మదించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అభిమానులకు సర్ప్రైజ్ ఇస్తూ రామ్ చరణ్, జగపతి బాబుల మధ్య ఉండే మరికొన్ని కీలకమైన సీన్లను యాడ్ చేయబోతున్నారట. ఈ మార్పులన్నింటినీ పూర్తి చేసిన తర్వాత చిత్ర యూనిట్ ఈ కొత్త వర్షన్‌ను మళ్లీ సెన్సార్ చేసి థియేటర్లలో పాత వర్షన్ ను తీసేసి, ఈ కొత్త వెర్షన్‌ను అప్‌లోడ్ చేయనున్నారు. ఈ సరికొత్త మార్పులతో ఫుట్ ఫాల్స్ పెరుగుతాయని టీమ్ భావిస్తోంది.

# రామ్‌చరణ్ నటన మైండ్ బ్లోయింగ్

**జగపతి బాబు పాత్ర అద్భుతంగా ఉంది.. పెద్దిపై బన్నీ ప్రశంసలు**

వివాదాల నడుమ బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతున్న 'పెద్ది'పై ప్రశంసలు కూడా పెద్ద ఎత్తున విన్పిస్తున్నాయి. ఇలాంటి టైమ్ లో అల్లు అర్జున్ చేసిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో రచ్చ చేస్తోంది. సినిమా విడుదలై ప్రేక్షకుల నుంచి స్పందన వస్తున్న వేళ, స్వయంగా సినిమా చూసిన బన్నీ తన అభిప్రాయాన్ని పంచుకోవడం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. 'పెద్ది' చూసిన తర్వాత రామ్ చరణ్ నటన గురించి అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలు మెగా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. బన్నీ తన పోస్ట్ లో చరణ్ పర్ఫార్మెన్స్ మైండ్ బ్లోయింగ్ గా ఉందని చెప్పారు, అలాగే చెర్రీ పెద్ది పాత్రలో ఇంటెన్స్ గా, సహజంగా, అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ తో ఆకట్టుకున్నాడని, డ్యాన్స్ లో కనిపించిన గ్రేస్ అన్నీ కలిసి ఒక పూర్తి స్థాయి నటుడిగా చరణ్ ను మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. ప్రతి అంశంలోనూ చరణ్ అద్భుతంగా రాణించాడని, ప్రస్తుతం అతడికి వస్తున్న ప్రశంసల్లో ప్రతి ఒక్కటి అతడు సంపాదించుకున్నవేనని చెప్పారు. తన సోదరుడి విజయాన్ని చూసి గర్వంగా ఉందని కూడా అల్లు అర్జున్ పేర్కొన్నారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన జగపతి బాబు గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన నటన బలంగా నిలిచిందని చెప్పారు. అలాగే జాన్వీ కపూర్ తో పాటు మిగతా నటీనటులందరికీ అభినందనలు తెలియజేశారు. తెరపై కనిపించే నటీనటులే కాదు, సినిమా కోసం కష్టపడిన టెక్నీషియన్స్, నిర్మాతలు కూడా ప్రశంసలకు అర్హులని చెప్పారు. అయితే అల్లు అర్జున్ పోస్ట్ లో మరో ముఖ్యమైన అంశం దర్శకుడు బుచ్చిబాబు సానాపై చేసిన ప్రశంసలు. ప్రతి పాత్రను ఎలివేట్ చేస్తూనే రామ్ చరణ్ పాత్రను మరింత ఎత్తుకు తీసుకెళ్లినందుకు దర్శకుడికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఒక హీరోని మాత్రమే కాకుండా మొత్తం కథలోని పాత్రలన్నింటినీ బలంగా నిలబెట్టడం దర్శకుడి విజయమని ఆయన సందేశం ద్వారా స్పష్టమైంది. సాధారణంగా అభిమానుల మధ్య పోలికలు, ఫ్యాన్ వార్స్ ఎక్కువగా కన్పిస్తాయి. కానీ ఒక స్టార్ హీరో మరో స్టార్ హీరో పనితీరును ఇంత ఓపెన్ గా ప్రశంసించడం అరుదుగా జరుగుతుంది. అందుకే అల్లు అర్జున్ పోస్ట్ ఇప్పుడు వైరల్ గా మారింది.

# విడుదలకు రెడీ అవుతున్న అఖిల్ లెనిన్

అక్కినేని యువ హీరో అఖిల్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ 'లెనిన్'. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ ఊరమాస్ గ్రామీణ ప్రేమకథా చిత్రం జూన్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. టీజర్, సాంగ్స్ రిలీజ్ అయ్యాక ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ప్రీ-రిలీజ్ థియేట్రికల్ బిజినెస్ సర్కిల్స్‌లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ బిజినెస్ క్లోజ్ అయినట్లు టాక్. రాయలసీమ మినహాయించి మిగిలిన ఆంధ్ర రీజియన్ థియేట్రికల్ హక్కులు దాదాపు రూ. 9 కోట్ల రేషియోలో క్లోజ్ అయింది. అఖిల్ గత చిత్రం ఏజెంట్ బిగ్గెస్ట్ డిజాస్టరా అయినా కూడా 'లెనిన్' స్జబెక్ట్ మరియు ప్రోమోస్ లోని మాస్ అప్పీల్ చూసి బయ్యర్లు ఈ స్థాయి మొత్తాన్ని పెట్టడానికి ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది.ఈ చిత్రంలో అఖిల్ సరికొత్త రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తుండగా, ఆయనకు జోడీగా క్రేజీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. థమన్ అందిస్తున్న మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. ఈ సినిమాతో అఖిల్ బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కంబ్యాక్ ఇవ్వడం ఖాయమని అక్కినేని అభిమానులు నమ్మకంగా ఉన్నారు. ఆంధ్ర ఏరియాలోనే 9 కోట్ల రేషియోలో బిజినెస్ కదా రాయలసీమ మంచి రేట్ వచ్చే అవకాశం ఉంది. ఇక నైజాంలో అన్నపూర్ణ సొంత డిస్ట్రిబ్యూషన్ పైనే రిలీజ్ చేసే అవకాశం ఉంది.



# పెంపుడు కుక్కను మట్టుపెట్టిన దుర్మార్గుడు

**కన్నీరు పెట్టుకున్న నటి మంజరి ఫడ్నిస్**

తన అపార్ట్‌మెంట్‌లో ఉండే ఓ కుక్కను విచక్షణారహితంగా కొట్టి చంపేశారంటూ నటి మంజరి ఫడ్నిస్ ఆవేదన వ్యక్తంచేశారు. 2019లో తమ సొసైటీలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ కుక్కని వదిలివెళ్లారని అప్పటినుంచి దాన్ని 'మైకీ' అని పేరుతో తామే పెంచుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని రోజుల నుంచి అది కనిపించకపోవడంతో పోస్టర్లు కూడా వేసి వెతికామని.. ఈ క్రమంలో సొసైటీకి చెందిన ఓ వ్యక్తి అత్యంత కిరాతకంగా దాన్ని కొట్టి చంపేశారని ఆరోపించారు. భవిష్యత్తులో ఇలా ఎవరూ జంతుహింసకు పాల్పడకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని మంజరి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆమె విలపిస్తూ మాట్లాడుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. భూమి పెడ్నేకర్‌తో పాటు మరికొందరు దీనిపై స్పందించారు. 2004లో ఓ హిందీ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మంజరి అల్లరి నరేశ్‌తో కలిసి 'సిద్ధూ ఫ్రమ్ శ్రీకాకుళం', 'శుభప్రదం' చిత్రాల్లో నటించారు. అలాగే ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'శక్తి'లో గౌరిగా కనిపించారు.

# కింగ్ నారార్జున వందో మూవీ

**సైలెంట్‌గా షూటింగ్ పూర్తి చేస్తున్న చిత్ర బృందం**

టాలీవుడ్ కింగ్ నాగార్జున నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. 'కింగ్ 100', 'లాటరీ కింగ్' అనే వర్కింగ్ టైటిల్స్‌తో ప్రచారంలో ఉన్న ఈ మైల్‌స్టోన్ చిత్రానికి రా.కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా దూసుకుపోతోంది. అంతేకాదు.. షూటింగ్ దాదాపుగా చివరి దశకు చేరుకున్నట్టుగా టాక్. త్వరలోనే చిత్రీకరణ మొత్తాన్ని పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనుల పై ఫోకస్ చేసేందుకు చిత్ర యూనిట్ ఎ÷–లాన్ చేస్తోందట. మరోవైపు మ్యూజిక్ వర్క్ కూడా శరవేగంగా జరుగుతోందట. వచ్చే నెలలోనే ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసే ఆలోచనలో కూడా ఉన్నారట. అంతేకాదు.. అన్ని అనుకున్నట్టుగా జరిగితే ఈ ల్యాండ్‌మార్క్ మూవీని 2026 దసరా పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. కానీ, ఇప్పటి వరకు అఫీషియల్ అనౌన్స్మెంట్ మాత్రం రాలేదు. అసలు ఈ సినిమా టైటిల్ ఏంటి? నాగార్జున లుక్ ఎలా ఉంటుంది? అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు అభిమానులు. కానీ, కింగ్ ఈసారి అదిరిపోయే సర్ప్రైజ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా సీనియర్ స్టార్ హీరోయిన్ టబు కీలక పాత్ర పోషిస్తుండగా.. యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ కలిపి తెరకెక్కిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసే ఛాన్స్ ఉంది. మరి కింగ్ 100తో నాగార్జున ఎలా ఎ÷–లాన్ చేస్తున్నాడో చూడాలి.

